ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
బాపట్ల జిల్లా వార్తలు
5
బుధవారం 13 ఆగస్టు 2025





జెండా వందనం చేస్తున్న మంత్రి మనోహర్

అమరుల త్యాగం అజరామరం

క్విట్ ఇండియా స్ఫూర్తితో సాగుదాం ● రణరంగచౌక్ సభలో మంత్రి మనోహర్

తెనాలి అర్బన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): అమరవీరుల త్యాగం అజరామరమని వారి స్ఫూర్తితో ముందుకు నడుద్దామని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో స్థానిక రణరంగచౌక్‌లో అమరవీరుల స్మారక స్థూపాల వద్ద సంస్మరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మనోహర్‌తో పాటు విద్యార్థులు, పట్టణ ప్రజలు, అధికారులు, ప్రజా ప్రతినిధులు రణరంగచౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా క్విట్ ఇండియా ఉద్యమంలో అమరులైన స్వాతంత్ర్య సమరయోధులకు పట్టణ ప్రజలు నివాళులర్పించారు. మంత్రి మనోహర్ భరతమాతకు పూలు సమర్పించి జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. క్విట్ ఇండియా ఉద్యమంలో బ్రిటీష్ కాల్పులకు ప్రాణత్యాగం చేసిన అమరవీరులు మాజేటి సుబ్బారావు, సిరిగిరి లింగం, భాస్కరుని లక్ష్మీనారాయణ, తమ్మినేని సుబ్బారెడ్డి, (మిగతా 8వ పేజీలో)



ఎన్‌సీసీ క్యాడెట్లతో మంత్రి మనోహర్



క్షాత్ర బ్యాగులను చిన్నారులకు అందజేస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్

సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై సమరం

గుంటూరు నుంచి యుద్ధం ప్రారంభం

ఇక్కడ విజయవంతమైతే 26 జిల్లాలకు విస్తరణ ● రెడ్‌క్రాస్ ప్రచార కార్యక్రమంలో గవర్నర్ అబ్దుల్‌నజీర్

గుంటూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): సింగిల్ యూజ్ ప్లాస్టిక్ పై సమరం సాగించాలని, ఈ ప్రాజెక్టు విజయవంతం అవడానికి పూర్తి మద్దతును అందిస్తామని గవర్నర్ అబ్దుల్ నజీర్ తెలిపారు. రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో 'ఆంధ్రప్రదేశ్ వాతావరణ కార్యాచరణ, అమరావతి ప్లాస్టిక్ రహిత నగర ప్రచార కార్యక్రమాన్ని' మంగళవారం గవర్నర్ నజీర్ (మిగతా 8వ పేజీలో)



అధికారులు అప్రమత్తం కావాలి

విపత్తు నిర్వాహణపై సమీక్షలో కలెక్టర్

బాపట్ల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): గురు, శుక్రవారాల్లో భారీవర్షాల హెచ్చరికల నేపథ్యంలో అప్రమత్తం కావాలని కలెక్టర్ జె.వెంకటమురళి అధికారులను ఆదేశించారు. విపత్తు నిర్వాహణ, పర్యవేక్షణపై ఆర్డీవోలతో మంగళవారం కలెక్టరేట్‌లో ఆయన సమీక్షించారు. భారీవర్షాలతో జలమయమయ్యే లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని చెప్పారు. తుఫాన్ వస్తే ఏ ప్రాంతాల వారిని తొలుత సురక్షిత ప్రాంతాలకు తరలించాలో, ప్రాణనష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలనే అంశాలపై ప్రణాళిక రూపొందించి సిద్ధం కావాలన్నారు. కృష్ణానది ఎగువ ప్రాంతాలు నుంచి 2.50 లక్షల క్యూసెక్కుల వరద నీరు దిగువకు విడుదల చేస్తున్నారని, భారీ వర్షాలతో అది 4 లక్షల క్యూసెక్కుల కంటే మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. ఈ క్రమంలో అధికారులు ముందస్తుజాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్యాస్‌సిలెండర్లు, వాహనాలు, జనరేటర్లు, ఎక్సకవేటర్లు సిద్ధం చేసుకోవాలన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి జేసీ జి.గంగాధర్‌గౌడ్, రివర్ కన్జర్వేటర్ కార్యనిర్వాహక ఇంజనీర్ రవికిరణ్, ఆర్డీవోలు పి.గ్లోరియా, చంద్రశేఖర్, రామలక్ష్మి, కలెక్టరేట్ ఏవో మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.



అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ వెంకటమురళి

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

విద్యార్థులకు కలెక్టర్ సూచన

బాపట్ల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): పరిశుభ్రతతోనే ఆరోగ్యం పదిలంగా ఉంటుందని కలెక్టర్ జె.వెంకటమురళి విద్యార్థులకు తెలిపారు. స్థానిక అక్బర్‌పేటలోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలలో మంగళవారం జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని కలెక్టర్ ప్రారంభించారు. చేతులు పరిశుభ్రంగా కడుక్కోవడంపై, పౌష్టికాహార పదార్థాల వినియోగంపై విద్యార్థులు ఇచ్చిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా కలెక్టర్ వారిని ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం నులిపురుగుల మాత్రలను విద్యార్థులకు పంపిణీ చేశారు. చేతులు శుభ్రంగా కడుక్కొని భోజనం చేస్తే నులిపురుగులను నివారించగలమని కలెక్టర్ చెప్పారు. కార్యక్రమంలో ఆర్డీవో పి.గ్లోరియా, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మ, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ రత్నమన్మోహన్, ఆర్‌బీఎస్‌కే పీవో డాక్టర్ లలిత రాజేశ్వరి, డీసీ డాక్టర్ ప్రవీణ్, బీపీఎమ్‌వో డాక్టర్ మనోజ్, డాక్టర్ మౌనిక, మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినులకు నులిపురుగుల నివారణ మాత్రలు వేస్తున్న కలెక్టర్ జె.వెంకటమురళి

ఒడిస్సాకు చెందిన కూలీ మృతి

క్వారీలో డ్రిల్లింగ్ చేస్తుండగా ఘటన



ప్రమాదం జరిగిన క్వారీ

కశ్యప్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ నాగరాజు

బల్లికురవ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నక్కబొక్కలపాడు గ్రామ పరిధిలో సనకొండ ప్రాంతంలో ఉన్న వెంకటసాయి స్టోన్ క్రషర్‌కు చెందిన కంకర క్వారీలో మంగళవారం ఒడిస్సా రాష్ట్రం మజీలిపదర్ గ్రామానికి చెందిన సాధురాం కశ్యప్(32) మృతి చెందాడు. రోజు మాదిరిగానే బ్లాస్టింగ్ అనంతరం కొండపై భాగంలో పగుల్లిచ్చిన రాయిని డ్రిల్లింగ్‌తో కశ్యప్ పడగొడుతున్నాడు. ఈ క్రమంలో డ్రిల్లింగ్ యంత్రం కింద ఉన్న రాయి అచ్చు ఊడి కింద ఉన్న రాళ్లపై అతడు పడిపోయాడు. దీంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఇటీవలే కశ్యప్ పనుల కోసం క్వారీకి వచ్చాడని తోటి కూలీలు తెలిపారు. కంకర క్వారీలో సరైన జాగ్రత్తలు తీసుకోకపోవటం వల్లే ప్రమాదం జరిగిందని స్థానికులు ఆరోపించారు. ఘటనా స్థలిని సంతమాగులూరు సీఐ వెంకట్రావు, ఎస్ఐ నాగరాజులు పరిశీలించారు. వీఆర్వో మునలయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని మార్టూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.



అద్దంకి పట్టణం వ్యూ

ప్రకాశం జిల్లాలోకి అద్దంకి?

నేటి మంత్రి వర్గ ఉపసంఘంలో నిర్ణయం

అద్దంకి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): అద్దంకి నియోజకవర్గం ప్రకాశం జిల్లాలోకి మారుతుందని.. అద్దంకి కేంద్రంగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటు అవుతుందని అద్దంకి ప్రాంతవాసులు ఆశిస్తున్నారు. ఈ మేరకు కొత్త జిల్లాల ఏర్పాటు, చేర్పులు, మార్పులపై బుధవారం జరిగే మంత్రి వర్గ ఉపసంఘం సమావేశంలో నిర్ణయం వెలువడే అవకాశం ఉందని అద్దంకివాసులు ఎదురు చూస్తున్నారు. ప్రధానంగా మార్కాపురం కేంద్రంగా ఐదు నియోజకవర్గాలతో కొత్త జిల్లా ఏర్పాటు ఖాయంగా కనిపిస్తుంది. ఇప్పటికే సీఎం చంద్రబాబునాయుడు, కూటమి నేతలు పలు సందర్భాలలో మార్కాపురం జిల్లా ఏర్పాటుపై హామీ కూడా ఇచ్చారని ఆ ప్రాంతప్రజలు గుర్తు చేస్తున్నారు. ప్రస్తుతం బాపట్ల జిల్లాలో ఉన్న అద్దంకి, నెల్లూరు జిల్లాలోని కందుకూరు నియోజకవర్గాలు ఆయా జిల్లా కేంద్రాలకు దూరంగా ఉన్నాయి. ఈ క్రమంలో ఉమ్మడి ప్రకాశం జిల్లాలో పలు మార్పులకు అవకాశం ఉంది. అద్దంకి కేంద్రంగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు అద్దంకి ప్రాంత ప్రజలు చాలాకాలంగా ఎదురు చూస్తున్నారు. అద్దంకి రాజధానిగా రెడ్డిరాజులు పాలన సాగించారు. చారిత్రక గుర్తింపు ఉన్న అద్దంకి సుదీర్ఘ కాలం తాలూకా కేం ద్రంగా కూడా ఉంది. ఇప్పటికే గ్రానైట్ పరిశ్రమతో అద్దంకి నియోజకవర్గం అభివృద్ధి చెందింది. పలు పరిశ్రమలు ఏర్పాటుకు కూడా ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో అద్దంకిని రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేసేందుకు మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే రెవెన్యూ డివిజన్ ఏర్పాటు జరిగితే అద్దంకి నియోజకవర్గంలోని మండలాల వరకే పరిమితం చేస్తారా లేక సమీపంలోని కొన్ని మండలాలను కూడా కలుపుతారా అన్న విషయంపై ప్రజల్లో చర్చ జరుగుతుంది. దర్శి నియోజకవర్గంలోని తాళ్ళూరు, ముండ్లమూరు మండలాలు ప్రస్తుతం ఒంగోలు రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉన్నాయి. జిల్లాల పునర్విభజన సమయంలో ఆయా మండలాలను మార్కాపురం జిల్లా పరిధిలో కలుపుతారా, లేక ఒంగోలు కేంద్రంగా ఉండే ప్రకాశం జిల్లాలో ఉంచుతారా అన్న దానిపై విస్తృతంగా చర్చ జరుగుతుంది. ఈ రెండు మండలాలు మార్కాపురానికి దూరం ఉండటంతో రెండు మండలాల ప్రజలు ఒంగోలు కేంద్రంగా ఉండే ప్రకాశం జిల్లాలో ఉండేందుకు ఇష్టపడుతున్నారు. తాళ్ళూరు, ముండ్లమూరు మండలాలు ఒంగోలు జిల్లాలో ఉంచితే అద్దంకి కేంద్రంగా ఏర్పడే రెవెన్యూ డివిజన్‌లో కలిపేందుకు అవకాశం ఉంటుందనే అభిప్రాయం కూడా వ్యక్తమవుతుంది.

నగరంలో తగ్గని విష జ్వరాలు

- ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న 12 మంది
- పారిశుధ్యం అధ్వానం.. పట్టించుకోని అధికారులు

రేపల్లె, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): తీరప్రాంతంలోని నగరంలో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. ఒక పక్క పారిశుధ్యాన్ని మెరుగుపరుస్తున్నామంటూ అధికారులు ప్రకటనలు చేస్తున్నారే తప్ప ఆచరణలో అది అమలు కావడంలేదు. నగరంలో ఎక్కడికక్కడ మురుగు నీరు స్తంభించి అపరిశుభ్రత తాండవిస్తోంది. ఆయా ప్రాంతాలు దోమలకు నిలయాలుగా మారాయి. దీనికితోడు రోడ్లవెంబడి చెత్తాచెదారాలతో పారిశుధ్యం అధ్వానంగా మారి ప్రజలు విష జ్వరాల బారిన పడుతున్నారు. ఇప్పటికే నగరం ప్రభుత్వ వైద్యశాలలో 12 మంది జ్వరంతో చికిత్స పొందుతున్నారు. వారిలో ఆరుగురికి ప్లేట్‌లెట్స్ తగ్గిపోవడంతో కుటుంబసభ్యులు భయాందోళన చెందుతున్నారు. ఆస్పత్రిలో సరైన సౌకర్యాలు పూర్తిస్థాయిలో లేకపోవడంతో కొంతమేర ఇబ్బంది నెలకొంది. ఉన్నతాధికారులు దృష్టిసారించి జ్వరబాధితులకు మెరుగైన వైద్యం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కుటుంబసభ్యులు కోరుతున్నారు. గ్రామాల్లో పారిశుధ్యంపై అధికారులు దృష్టి సారించాలని గ్రామస్థులు ఆశిస్తున్నారు.



వైద్యశాలలో చికిత్స పొందుతున్న జ్వరబాధితులు

యాజలిలో ఒకరికి డెంగీ లక్షణాలు

ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స... పరామర్శించిన అధికారులు

కర్లపాలెం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యాజలి గ్రామానికి చెందిన గురువయ్య కొన్ని రోజులుగా జ్వరంతో అస్వస్థతకు గురయ్యారు. దీంతో అతడ్ని కుటుంబసభ్యులు కర్లపాలెంలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చేర్పించారు. వైద్యులు పరీక్షించి డెంగీ లక్షణాలు ఉన్నట్లు గుర్తించారు. ఈ విషయం తెలిసి మంగళ వారం తహసీల్దార్ షాకీర్‌పాషా, ఎంపీడీవో ఐనంపూడి శ్రీనివాసరావు, డాక్టర్ గోపినాథ్ ఆస్పత్రికి వెళ్లి గురవయ్యను పరామర్శిం చారు. గురవయ్యకు నిర్వహించిన రక్తపరీక్షలలో ఎన్ఎస్ 1 పాజిటివ్ నిర్ధారణ అయినట్లు డాక్టర్ గోపీనాథ్ తెలిపారు. యాజలిలోని గురవయ్య ఇంటి పరిసరాలను పంచాయతీ సిబ్బంది పరిశుభ్రం చేసి, బ్లీచింగ్ చల్లారు.

మాఫియా.. మంత్రగాడు

- అమలాపురంలో రేషన్ బియ్యం తరలిస్తున్న వాహనాన్ని అధికారులు పట్టుకున్నారు. దానిపై ఆరా తీస్తే మూలాలు ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఉన్నట్లు వెల్లడైంది.
- మిర్యాలగూడ సమీపంలో తెలంగాణ వెళుతున్న వాహనాలను అధికారులు పట్టుకున్నారు. వాటి మూలాలు గుంటూరు జిల్లాలోనే తేలాయి.





(ఆంధ్రజ్యోతి గుంటూరు)

- రేషన్ బియ్యం రీసైక్లింగ్.. రవాణా అతడి కనుసన్నల్లో ..
- మూడు జిల్లాల్లో అక్రమాలు
- రాష్ట్రంలో ఎక్కడ బియ్యం దొరికినా ఉమ్మడి గుంటూరులోనే మూలాలు

..ఇలా ఎక్కడ రేషన్ వాహనాలు దొరికినా వాటి మూలాలు గుంటూరులోనే తేలుతున్నాయి. అంతలా రేషన్ మాఫియా విస్తరించింది. రాష్ట్రంలో, దేశంలో ఏ మూల రేషన్ బియ్యం వాహనాలు దొరికినా కేరాఫ్ అడ్రస్ గుంటూరు అనేంతగా మాఫియా మంత్రగాడు చెలరేగిపోతున్నాడు. మాఫియా మంత్రగాడు ఉమ్మడి గుంటూరు జిల్లా మొత్తం మీద పట్టు సాధించాడు. పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో సేకరించే బియ్యం మొత్తానికి ఏకైక దిక్కు. సదరు మంత్రగాడే. కిలో రూ.21 కొనుగోలు చేసి, రీ సైక్లింగ్ చేసి రూ.26 నుంచి 30 వరకూ సొమ్ము చేసుకుంటున్నాడు. పేదల బియ్యం సరిహద్దులు దాటించే బాధ్యత వారిదే. వారి దయా దాక్షిణ్యాలుంటేనే మాఫియా శిబిరంలో మనుగడ ఉంటుంది. మాఫియా మొత్తాన్ని తన కనుసైగలతో శాశిస్తున్నాడు. అతడు దయతలిస్తేనే మాఫియా శిబిరంలో ఎవరైనా మనగలుగుతారు.. కాదంటే కనీసం అడ్రస్ కూడా లేకుండా పోతారు. అంత పకడ్బందీగా మాఫియా మంత్రగాడు వ్యవస్థను తన అదుపులో పెట్టుకున్నాడు. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ప్రతి నెలా కొన్ని వందల టన్నులు పేదల బియ్యాన్ని రాష్ట్ర, దేశ సరిహద్దులు దాటి తరలిస్తున్నాడు.

డాన్ దయాదాక్షిణ్యాలతోనే మనుగడ

ఉమ్మడి గుంటూరు జిల్లాలో రేషన్ మాఫియా పటిష్టమైన చక్రబంధాన్ని ఏర్పాటు చేసుకుంది. రేషన్ మాఫియా, రైస్ మిల్లర్లు, ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో ఏర్పాటైన ఈ సిండికేట్ అత్యంత పకడ్బందీగా వ్యవహారాన్ని నడిపిస్తోంది. క్షేత్రస్థాయిలో రేషన్ బియ్యాన్ని సేకరించడం మాఫియా డాన్ అతడి అనుచరగణం పని. ఆ బియ్యాన్ని రీ సైక్లింగ్ చేసి పక్క రాష్ట్రాలు, ఇతర దేశాలకు తరలించడం సదరు మంత్రగాడి పని. వాటిని (మిగతా 8వ పేజీలో)

ఖజానాలో.. కాసుల గోల

- ఉద్యోగులు మారినా మళ్లీ అదే తీరు
- పింఛన్, ఉద్యోగుల బిల్లులకు తిరకాసులు
- గతంలో ఏడుగురిపై వేటు.. ఆగని వేధింపులు



చీరాల ఉప ఖజానా కార్యాలయం

చీరాల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): తోటి ఉద్యోగులు అయినా లంచాల కోసం డిమాండ్లు.. అడిగినంత ఇవ్వని వారికి వేధింపులు.. ఇదీ చీరాల ఉప ఖజానా కార్యాలయంలో ఉద్యోగుల తీరు. ఉద్యోగుల వేధింపులపై అధికారులు విచారణ జరిపి ఏడాది క్రితం ఏడుగురిపై చర్యలు తీసుకున్నారు. అయితే వారి స్థానంలో కొత్తగా ఉద్యోగులు వచ్చారే కానీ వారు కూడా గతంలోని వారిలాగే వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఉద్యోగులు మారారే గానీ వారి తీరు మారలేదని పలువురు వాపోతున్నారు. వివిధ బిల్లుల కోసం వచ్చే ఉద్యోగులను, పింఛన్‌దారులను గతంలో మాదిరిగానే పీడిస్తున్నారు. కార్యాలయం పరిధిలో సుమారు 8 నుంచి 9 వేల వరకు ఉద్యోగులు, పింఛన్ దారులు ఉన్నారు. వారికి సంబంధించిన జీతాల బిల్లులు, గుత్తేదారుల బిల్లులు ఎరియర్స్ బిల్లులు పెండింగ్ పడుతున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. సాధారణంగా ప్రతీనెలా జీతాలు, పింఛన్‌లు, టీఏ, డీఏ బిల్లులు, ఇతర కాంట్రాక్టు పనుల బిల్లులకు సంబంధించిన కార్యకలాపాలు ఇక్కడి సిబ్బంది ఆమోదించాలి. ఆయా వ్యవహారాల ప్రక్రియలో కొందరు ఉద్యోగులు బాహాటంగానే లంచం డిమాండ్ చేస్తూ సేవలు పెండింగ్ పెడుతున్నారు. కార్యాలయంలో ఇంత జరుగుతున్నా అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. ఇప్పటి వరకు ట్రెజరీలో ఎన్ని బిల్లులు పెండింగ్ ఉన్నాయి? ఎందుకు ఉన్నాయి? ఎవరెవరి లాగిన్‌లో ఉన్నాయి వంటి అంశాలపై అధికారులు పరిశీలించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.



మెగా కిసాన్ మేళా ఏర్పాట్లను పరిశీలిస్తున్న ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ

19న మెగా కిసాన్ మేళా

● ఆధునిక వ్యవసాయంతో ఆర్థిక ప్రగతి
● ఉద్యాన పంటల వైపు రైతును ప్రోత్సహించాలి
● చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఆధునిక వ్యవసాయంతోనే రైతు ఆర్థిక ప్రగతి సాధ్యమని, ఉద్యాన పంటల సాగు దిశగా రైతుల్లో అవగాహన పెంపొందించి ప్రోత్సహించాలని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు కోరారు. మంగళవారం వినుకొండలో జరిగిన ఫెర్టిలైజర్స్ డీలర్లు, సహకారసంఘాల సీఈఓల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రైతు ఆర్థిక ప్రగతి ద్వారానే అభివృద్ధి సాధ్యమని తెలిపారు. వినుకొండ ప్రాంతంలో 1.30లక్షల ఎకరాలు సాగుభూమి ఉందని, దానిలో ఈ ఏడాది 14వేల ఎకరాల్లో పండ్లతోటల సాగుకు ప్రోత్సహించాలని కోరారు. ఉద్యానసాగు పంటలకు ప్రభుత్వం డ్రిప్ ఇరిగేషన్, రాయితీలు అందిస్తుందని రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతు ఆర్థికప్రగతికి బాటలు వేసేందుకు ఈనెల 19వ తేదీన వినుకొండ మార్కెట్‌యార్డులో మెగా కిసాన్ మేళా జరుగుతుందని, ఆధునిక వ్యవసాయం-ఆర్థికప్రగతి అనే అంశంపై రైతులకు అవగాహన సదస్సు జరుగుతుందని, రైతుల అవగాహన పెంపొందించేందుకు ఆచార్య ఎన్జీరంగా అగ్రికల్చర్ యూనివర్సిటీ నుండి సైంటిస్టులు హాజరై సలహాలు సూచనలు ఇవ్వనున్నట్లు తెలిపారు. మెగా కిసాన్‌మేళాకు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు, పల్నాడు జిల్లా ఇన్చార్జి మంత్రి గొట్టిపాటి రవి, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, జిల్లా కలెక్టర్, వ్యవసాయ, ఉద్యానశాఖలతోపాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. కావున నియోజకవర్గంలో రైతులు వేలాదిగా తరలివచ్చి లాభసాటి వ్యవసాయంపై శాస్త్రవేత్తలు చేసే సూచనలు, సలహాలు పాటించి పండ్లతోటల సాగుపై రైతులు అవగాహన పెంపొందించుకోవాలని కోరారు. కిసాన్‌మేళ సభా ప్రాంగణస్థలాన్ని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవి ఆంజనేయులు పరిశీలించి ఏర్పాట్లు త్వరితగతిన పూర్తి చేయాలని వ్యవసాయ, ఉద్యానశాఖల అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జీడీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, ప్రజాప్రతినిధులు, ఫర్టిలైజర్స్ అసోసియేషన్ నాయకులు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



ఉచిత బస్సు ప్రయాణీకుల కోసం పిడుగురాళ్ల డిపోలో బస్సులకు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

స్త్రీ శక్తికి.. సిద్ధం చేస్తున్నారు..

పిడుగురాళ్ల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 15వ తేదీ నుండి మహిళలకు స్త్రీ శక్తి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణాన్ని నిర్వహించనున్న నేపథ్యంలో పిడుగురాళ్ల ఆర్టీసీ డిపోలో వున్న బస్సులన్నీ ఉచితానికి సిద్ధం చేస్తున్నారు. అవసరమైన బస్సులకు సీట్లు, టైర్లు మార్పిడి, బస్సులో పల హ్యాండిల్స్, ఫుట్‌పాత్‌లు ఏర్పాటు చేశారు. ఇప్పటిదాకా కొన్ని బస్సులకు ఎక్కే మార్గం బస్సు ముందుభాగంలో వున్న వాటిని తొలగించి బస్సు మధ్యలో డోర్‌లు ఏర్పాటు చేస్తున్నారు. ఆర్టీసి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 15వ తేదీ శుక్రవారం నుండి పిడుగురాళ్ల డిపోలో వున్న 63 బస్సులను మహిళల కోసం ఉచిత బస్సులుగా మార్చేందుకు అధికారులు సన్నాహాలు పూర్తిచేస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని ప్రారంభిస్తారని అధికారులు వివరించారు.

రౌడీలపై ఉక్కుపాదం మోపండి

● పౌరసరఫరాల శాఖ మంత్రి మనోహర్

తెనాలి, మారీసుపేట, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): రౌడీలు, చట్టవ్యతిరేక కార్యక్రమాలు చేసేవారిపై ఉక్కుపాదం మోపాలని పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పోలీస్ అధికారులకు సూచించారు. మంగళవారం తెనాలి త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌ను ఆయన సందర్శించారు. నేర నియంత్రణకు సమన్వయంతో కృషిచేయాలని అధికారులకు సూచించారు. మహిళ పోలీసులతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. సీఐ రమేష్‌బాబుకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట సబ్‌కలెక్టర్ సంజనాసింహ, డీఎస్పీ బీ జనార్ధనరావు ఉన్నారు.



మహిళా సిబ్బందితో మాట్లాడుతున్న మంత్రి మనోహర్, పక్కన సబ్ కలెక్టర్ సంజనా సింహ తదితరులు

సాగర్ ప్రాజెక్టుకు భారీగా పెరిగిన వరద

● 18 క్రస్ట్‌గేట్ల ద్వారా నీటి విడుదల

విజయపురిసౌత్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ జలాశయానికి శ్రీశైలం నుంచి 1,86,258 క్యూసెక్కుల వరదనీరు వస్తుండడంతో మంగళవారం ప్రాజెక్ట్ అధికారులు 18 క్రస్ట్‌గేట్లను తెరిచి దిగువకు నీటిని విడుదల చేశారు. ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 28,420 క్యూసెక్కులు, కుడికాలువ ద్వారా 7086, ఎడమకాల్వ ద్వారా 3788, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, మొత్తం ఔట్‌ఫ్లోగా 1,86,258 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్‌ప్రాజెక్ట్ నీటిమట్టం 589.50 అడుగులుంది. ఇది 310.55 టీఎంసీలకు సమానం.



18 క్రస్ట్‌గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

పులిచింతలకు 1,61,661 క్యూసెక్కులు

● 0.9969 ఎంయూల విద్యుదుత్పత్తి

రెంటచింతల, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని కృష్ణానదిపై నిర్మితమైన నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్‌ప్రాజెక్టు నుంచి దిగువన వున్న పులిచింతలకు 1,61,661 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఎస్ఈ కె.వెంకటరమణ,ఈఈ సుబ్రహ్మణ్యంలు చెప్పారు.ప్రాజెక్టుకు చెందిన 12 రేడియల్ క్రస్ట్ గేట్లను 2.5 మీటర్ల మేర ఎత్తి 1,53,756 క్యూసెక్కులు,రెండు యూనిట్ల ద్వారా విద్యుత్ తయారైన తరువాత 7905 మొత్తంగా 1,61,661 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామన్నారు.ఎగువన వున్న సాగర్ నుంచి 1,73,528 క్యూసెక్కుల నీరు వస్తుందన్నారు.రిజర్వాయర్‌లో 75.41 మీటర్ల మేర నీరుండగా ఈ నీరు 7.018 టీఎంసీ(థౌజెండ్ మిలియన్ క్యూసెక్స్)కు సమానం.

ప్రకాశం బ్యారేజికి..

● దిగువకు 71 వేల క్యూసెక్కులు



ప్రకాశం బ్యారేజి దిగువకు విడుదలవుతున్న వరదనీరు

తాడేపల్లి టౌన్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుండి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టు ప్రధాన వాగుల నుండి 72 వేల 926 క్యూసెక్కుల వరదనీరు మంగళవారం ఇన్‌ఫ్లోగా నమోదు అవుతున్నట్టు నీటిపారుదలశాఖ జేఈ రాజేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటి మట్టం కొనసాగుతుండగా 30 గేట్లను 2 అడుగులు, 40 గేట్లను 2 అడుగుల మేర ఎత్తి దిగువకు 71 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. అలాగే తూర్పు డెల్టా కాలువలకు 9 వేల 412 క్యూసెక్కులు పశ్చిమ డెల్టా కాలువలకు 6వేల 714 క్యూసెక్కులు, గుంటూరు ఛానల్‌కు 200 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్టు జేఈ తెలిపారు. వరద ఉధృతి పెరుగుతుండడంతో నది దిగువ ప్రాంతాల వారు అప్రమత్తంగా ఉండాలని, మత్స్యకారులు నదిలోకి వెళ్లరాదని అధికారులు సూచించారు.

నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు

● ఆరోగ్య శాఖ కమిషనర్ వీర పాండ్యన్ వెల్లడి
● మందడం జెడ్పీ హైస్కూల్‌లో మాత్రల పంపిణీ



విద్యార్థికి మాత్ర ఇస్తున్న కమిషనర్ వీరపాండ్యన్

గుంటూరు మెడికల్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ప్రతి సంవత్సరం రెండుసార్లు బాలబాలికలు ఆల్బెండజోల్ మాత్రలు తీసుకోవడం ద్వారా నులిపురుగుల నుంచి పూర్తి రక్షణ లభిస్తుందని రాష్ట్ర వైద్యఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండ్యన్ తెలిపారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం(డీవార్మింగ్) పురస్కరించుకొని మంగళవారం గుంటూరు జిల్లా వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో, తుళ్ళూరు మండలంలోని మందడం జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులతో ఆల్బెండజోల్ మాత్రలను ఆయన మింగించారు. కార్యక్రమంలో రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ అడిషనల్ కమిషనర్ డాక్టర్ సుబ్రహ్మణ్యేశ్వరి, డీఎంహెచ్‌వో డాక్టర్ కే విజయలక్ష్మి, డీఈవో రేణుక తదితరులు విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ వీర పాండ్యన్ మాట్లాడుతూ నులిపురుగుల వల్ల పిల్లల్లో రక్తహీనత, పోషకాహారలోపం, ఆకలి మందగింపు, కడుపు నొప్పి, వికారం, వాంతులు వంటి లక్షణాలు ఉంటాయన్నారు. ఆరు నెలలకు ఒకసారి ఆల్బెండజోల్ మాత్రలు మింగితే నులిపురుగులు దరిచేరవన్నారు. దీనివల్ల చదువులో చురుకుగ్గా ఉంటారని అన్నారు. డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ డీవార్మింగ్ డే సందర్భంగా మంగళవారం జిల్లా అంతటా పాఠశాలలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. మంగళవారం డీవార్మింగ్ పొందని పిల్లలకు ఆగస్టు 20వ తేదీన జరిగే మాపప్ కార్యక్రమంలో ఆల్బెండజోల్ మాత్రలు అందజేస్తారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ఏ శ్రావణ్‌బాబు, ఆర్‌బీఎస్‌కే పథకం జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ రోహిణి రత్నశ్రీ, వైద్యాధికారి డాక్టర్ శివపార్వతి పాల్గొన్నారు.

వర్షపు నీటిని బయటకు తీసివేయాలి

● ఏరువాక శాస్త్రవేత్తల సూచన

గుంటూరు సిటీ, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): వర్షాలకు నారుమడిలో, ఆరుతడి వరిసాగు పొలాలలో విత్తనం చల్లిన రెండునుంచి మూడురోజుల వయసులో ఎక్కువ నీటమునిగితే మొలకశాతం గణనీయంగా తగ్గుతుందని ఏరువాక కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎం. వెంకటరాములు, కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్.వెంకటలక్ష్మి తెలిపారు. వీలైనంత త్వరగా నీటిని బయటకు తీసివేయాలని వారు సూచించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు కారణంగా వరి నారుమడి, వరిపంట నీటమునిగితే తీసుకోవాల్సిన జాగ్రత్తలను మంగళవారం ప్రకటన విడుదల చేశారు. వరినారు నాటిన 7 నుంచి 30 రోజుల మధ్యలో ఐదు రోజుల కన్నా ఎక్కువగా నీటిలో మునిగితే నారు దెబ్బతినే అవకాశం ఉందన్నారు. నీరు పూర్తిగా బయటకు తీసివేసిన తర్వాత 5 సెంట్ల నారు మడికి ఒక కిలో యూరియా, ఒక కిలో పొటాష్, ఒక గ్రాము కార్బెండిజం లేదా 2 గ్రాముల కార్బెండిజం మరియు మాంకోజెబ్ లను లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు.

వన్‌స్టాప్ సెంటర్‌తో.. మహిళలకు రక్షణ

గుంటూరు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): హింసకు గురైన మహిళల రక్షణ, సమాచార సేవలు అందించడంలో వన్ స్టాప్ సెంటర్ అత్యంత కీలకపాత్ర పోషిస్తుందని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ ప్రసూన అన్నారు. గుంటూరు నగరంపాలెంలోని సఖి వన్ స్టాప్ సెంటర్లో మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. మానసిక, సాంఘిక ఆదరణ కల్పించడం, అవసరమైన కౌన్సెలింగ్ అందించడం, వారికి న్యాయ సహాయం చేయడంతో పాటు సఖి వన్‌స్టాప్ సెంటర్ ఆశ్రయం కూడా కల్పిస్తుందన్నారు. విమెన్ హెల్ప్ లైన్ 181ను నిర్వహించడంతోపాటు గృహహింస కేసులను పర్యవేక్షిస్తుందన్నారు. ప్రస్తుతం అమలులో ఉన్న నేషనల్ హెల్త్ మిషన్, 108 సేవలు, పోలీసు శాఖతో అనుబంధంగా పని చేయడం ద్వారా హింసకు గురైన మహిళలకు ఉన్న ప్రదేశంలోనే రక్షణ కల్పించడం, లేదా సమీపంలోని వైద్యశాలకు తరలించడం, హింసకు సరైన స్త్రీలకు వైద్య పరీక్షలు, చికిత్స నిమిత్తం సమీపంలోని వైద్యశాలకు తరలించి, నిపుణులైన కౌన్సెలర్‌తో మానసిక, సాంఘిక అంశాలలో కౌన్సెలింగ్ సదుపాయం కల్పిస్తామన్నారు. బాధిత మహిళలకు అవసరమైన మేరకు వన్‌స్టాప్ సెంటర్ ఆశ్రయం కల్పిస్తుందన్నారు. ఎక్కువ కాలం ఆశ్రయం అవసరమైనప్పుడు ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు నడిపే శక్తి సదన్‌ల లో ఆశ్రయం కల్పిస్తామన్నారు. హింసకు గురైన మహిళతో పాటు ఆమె పిల్లలకు వయస్సుతో నిమిత్తం లేకుండా ఆడపిల్లలకు, 8 సంవత్సరాల్లోపు మగపిల్లలకు కూడా 5 రోజులు వరకు ఆశ్రయం కల్పిస్తుందన్నారు. వన్‌స్టాప్ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ కే. శాంతిభూషణ్ పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.20 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

ట్రాక్టర్‌ను ఢీ కొట్టిన కారు.. వ్యక్తి మృతి

● మృతుడు పెసర్లంక వాసిగా గుర్తింపు



కర్ణుడు (ఫైల్)

తెనాలి, మారీసుపేట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్‌తో ఇసుక నింపుకొని అమ్మకాలు చేస్తూ జీవనం సాగిస్తున్న కార్మికుడు అదే ట్రాక్టర్ ట్రక్ కింద పడి మృతిచెందిన ఘటన తెనాలిలో కలకలం రేకెత్తించింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొల్లూరు మండలం పెసర్లంక గ్రామానికి చెందిన శొంఠి కర్ణుడు (53) ట్రాక్టర్ లో ఇసుక నింపుకొని భవన నిర్మాణదారులకు అమ్ముకుంటూ జీవనం సాగిస్తుంటాడు. ప్రతిరోజు పెసర్లంక నుండి తన ట్రాక్టర్‌లో ఇసుక లోడుతో తెనాలిలోని కబేళా వంతెన సమీపంలో నిలుపుదల చేసి అవసరమైన వారికి ఇసుక అన్‌లోడ్ చేస్తుంటాడు. ఇదే క్రమంలో మంగళవారం అదే ప్రాంతంలో ఇసుకతో ట్రాక్టర్‌ను నిలిపి ఉంచాడు. మధ్యాహ్నం సమయం కావడంతో ఎండ వేడిని తట్టుకోలేక ట్రాక్టర్ ట్రక్ కింద కూర్చున్నాడు. చందోలు తెనాలి ప్రధాన రహదారి కావడంతో అతి వేగంగా వచ్చిన కారు అదుపు తప్పి ట్రాక్టర్‌ను బలంగా ఢీ కొట్టింది. దీనితో ట్రాక్టర్ ట్రక్ క్రింద ఉన్న కర్ణుడుపై ట్రాక్టర్ ట్రక్ టైరు తలపైకెక్కడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడుకి భార్య, పిల్లలు ఉన్నారు. అనుకోని ప్రమాదంలో భర్త మృతిచెందడంతో భార్య కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించడం స్థానికులను కలిచివేసింది. ప్రమాదానికి కారణమైన కారు నడిపిన యువకులు మద్యం సేవించి ఉన్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. సంఘటనా స్థలానికి త్రీటౌన్ పోలీసులు చేరుకొని ఘటనకు వివరాలను విచారణ చేపట్టారు. మృతదేహన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదుచేస్తున్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	121, 129 140
చికెన్ విత్ స్కిన్(కిలో)	228.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	238.00

16, 17 తేదీల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

మంగళగిరి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): గుంటూరు-విజయవాడ జాతీయ రహదారి వెంబడి కొలనుకొండ వద్దగల హరే కృష్ణ గోకుల క్షేత్రంలో ఈ నెల 16, 17 తేదీల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు హరేకృష్ణ గోకులక్షేత్రం ప్రతినిధి రఘునందన్ దాస తెలియజేశారు. హరినామ జపమండపం, మహాభిషేకం, మంగళహారతి, 108 పవిత్రజల కలశాలతో పండ్లు, పంచామృతాలతో అభిషేకాలు, బాలగోపాలుడికి ఊంజల్ సేవ, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

51,686 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 53,783 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 51,686 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 9,821 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	9500	13400	334	9500	13500
నం.5	10000	13200	341	11000	14700
341	10000	14200	ఏసీ స్పెషల్‌వెరైటీ		
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			షార్క్-1	10000	14000
షార్క్-1	10000	14200	సింజెంటాబ్యాడిగి 5531	10000	12000
సింజెంటాబ్యాడిగి 5531	10000	13000	ఆర్మూరు	10200	12800
ఆర్మూరు	10000	13000	తాలుకాయలు	5000	7400

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె

జాతీయ సమైక్యతను చాటాలి

● కలెక్టర్ జె.వెంకటమురళి



మై కంట్రీ, మైఫ్లాగ్ ప్రదర్శిస్తున్న కలెక్టర్ వెంకటమురళి

బాపట్ల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : జాతీయ సమైక్యతను, దేశభక్తిని చాటేవిధంగా జిల్లా ప్రజలంతా స్వాతంత్ర్య దినోత్సవాలలో పాల్గొనాలని కలెక్టర్ జె.వెంకటమురళి పిలుపునిచ్చారు. సమగ్రశిక్ష ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి పోటీలలో నా దేశం, నా జెండా, వ్యాసరచన, డ్రాయింగ్‌లో మండల స్థాయిలో గెలిచిన విద్యార్థులందరూ పాల్గొన్నారు. విద్యార్థులు వేసిన డ్రాయింగ్ చూచి కలెక్టర్ మెచ్చుకున్నారు. మై కంట్రీ, మై ఫ్లాగ్ ఫ్రేమ్‌లో ఫొటోలు దిగటానికి జిల్లా అధికారులంతా ఉత్సాహంగా పాల్గొన్నారు. కలెక్టరేట్‌లో ఈ ఫ్రేమ్‌ను సందర్శకుల కోసం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో డీఈవో ఎస్.పురుషోత్తం, సమగ్రశిక్ష ఏపీసీ నాగిరెడ్డి, ఇన్‌చార్జి జేసీ జి.గంగాధర్‌గౌడ్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ ఎస్.విజయమ్మ, ఏఎంవో డాక్టర్ బిళ్లా మోజెస్ పాల్గొన్నారు.

స్వాతంత్ర్య వేడుకల ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్

బాపట్ల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య వేడుకలను పురస్కరించుకొని పోలీసుపేరెడ్‌గ్రౌండ్‌లో ఏర్పాట్లను కలెక్టర్ జె.వెంకటమురళి అధికారులతో కలిసి మంగళవారం సాయంత్రం పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేసి వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో పి.గ్లోరియా, మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి, ఏఆర్ డీఎస్పీ విజయసారధి తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులను పరిశీలించిన మండల ప్రత్యేకాధికారి

బాపట్లరూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల మండల ప్రత్యేకాధికారి, బీసీ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ఉపసంచాలకులు జీవీ శివలీల మంగళవారం బాపట్ల మండలంలోని ముత్తాయిపాలెం, అడవిగ్రామపంచాయతీలో పారిశుధ్య పనులను పరిశీలించారు. సచివాలయ సిబ్బందితో కలిసి పారిశుధ్య నిర్వహణ, ఇంటింటి సర్వేతో ప్రజలలో అవగాహన కల్పించారు. ఇంటిముందు ఉన్న తొట్టెలలో నీరు నిల్వవ ఉండకుండా చూసుకోవాలని ప్రజలకు తెలిపారు. ప్రతిరోజు హరితరాయబారుల ద్వారా ఇంటింటికి చెత్త సేకరణ, గ్రామాలలో ఎక్కడా వర్షపునీరు, మురుగునీరు నిల్వ ఉండకుండా చూడటం, జ్వరాలు వచ్చినప్పుడు తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు జారీ చేశారు. పశువుల వ్యర్థాలు ఇంటి పరిసరాలలో నిల్వ ఉంచకుండా ప్రజలలో అవగాహన కల్పించాలని పంచాయతీ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో జి.రామకృష్ణ, ముత్తాయిపాలెం, అడవిపంచాయతీ కార్యదర్శులు కరీముల్లా, పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.


ముత్తాయిపాలెం గ్రామంలో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న బాపట్ల మండల ప్రత్యేకాధికారి, బీసీ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ఉపసంచాలకులు శివలీల

చెరువు గ్రామ పంచాయతీలో సైడ్ కాల్వల మరమ్మతులు

బాపట్ల రూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : కలెక్టర్ ఆదేశాల మేరకు బాపట్ల మండలం చెరువుగ్రామపంచాయతీలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా మంగళవారం సైడ్‌కాల్వల పూడికతీత పనులను బాపట్ల డిప్యూటీ ఎంపీడీవో రామకృష్ణ ప్రారంభించారు. గ్రామంలో ఉన్న సైడ్‌కాల్వలు పూడిపోయి మురుగునీరు ప్రవహించే అవకాశం లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నందున ఎక్స్‌కవేటర్‌ల సహాయంతో పూడికతీత పనులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పవన్‌కుమార్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా డాక్టర్ ఎస్ఆర్ రంగనాథన్ జయంతి

పిట్టలవానిపాలెం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పిట్టలవానిపాలెం శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి డాక్టర్ మోర్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శాస్త్రవేత్త పితామహుడు డాక్టర్ ఎస్ఆర్ రంగనాథన్ జయంతి మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఇంజనీర్ దండు లక్ష్మీ నరసరాజు ముఖ్యఅతిథిగా పాల్గొని డాక్టర్ ఎస్ఆర్ రంగనాథన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. గ్రంథాలయాధికారి మోర్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ రంగనాథన్ గ్రంథాలయ శాస్త్ర పితామహుడిగా గ్రంథాలయ పుస్తకాలు, క్లాసిఫికేషన్స్, గ్రంథాలయ పంచసూత్రాలను ఆయన కనుగొన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అక్కా సుబ్బారెడ్డి, తాడికొండ నాగమురళి, మన్నెం ఉదయ్‌భాస్కర్, యెనుముల సుబ్బారావు పాల్గొన్నారు.

జ్వర పీడితులకు తక్షణ వైద్యం అందించాలి : సీపీఎం



జ్వరపీడితులను పరామర్శిస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్ గంగయ్య తదితరులు

బాపట్ల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : జ్వర పీడితులకు తక్షణ వైద్యం అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్ గంగయ్య వైద్యాధికారులను కోరారు. బాపట్ల ఏరియా వైద్యశాలను మంగళవారం ఆయన సందర్శించి డెంగీ జ్వర లక్షణాలతో బాధపడుతున్న వారి ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. బాపట్ల రైలుపేటకు చెందిన ఓ యువకుడు, కర్లపాలెం మండలానికి చెందిన మరో యువకుడిని ఆయన పరామర్శించారు. అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధార్ధను కలిసి వారి ఆరోగ్య పరిస్థితులు గురించి అడిగి తెలుసుకున్నారు. జ్వరపీడితులు నివాసం ఉండే ప్రాంతాలలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. డాక్టర్ సిద్ధార్ధ మాట్లాడుతూ రక్తపరీక్షలలో డెంగీ లక్షణాలు కనిపిస్తే వెంటనే అవసరమైన వైద్యం అందించేందుకు సంబంధిత వైద్యాధికారులను అందుబాటులో ఉంచామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కె.శరత్ పాల్గొన్నారు.

రైతులు పంట వివరాలు నమోదు చేసుకోవాలి

● జిల్లా వ్యవసాయాధికారి సుబ్రహ్మణ్యం

కర్లపాలెం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : ఖరీఫ్ పంట నమోదు మొదలైందని, రైతులు తాము వేసిన పంట వివరాలు గ్రామ వ్యవసాయ సహాయకులకు తెలియపరచి వెంటనే పంట నమోదు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి సుబ్రహ్మణ్యం అన్నారు. నల్లమోతువారిపాలెం గ్రామంలో జిల్లా వ్యవసాయాధికారి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో మంగళవారం 'పొలం పిలుస్తుంది' కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కౌలు వ్యవసాయదారులు పంట నమోదు తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ ధనరాజు, మండల వ్యవసాయాధికారి సుమంత్‌కుమార్, గ్రామ వ్యవసాయ సహాయకురాలు భవానీ, రైతులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా వ్యవసాయాధికారి సుబ్రహ్మణ్యం, రైతులు తదితరులు

వాహనాలు తనిఖీ చేసిన ఎస్ఐ

పిట్టలవానిపాలెం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చందోలు పోలీసుస్టేషన్ పరిధిలో రెడ్డిపాలెం టోల్‌ప్లాజాలో చందోలు ఎస్ఐ ఎం.వెంకటశివకుమార్ మంగళవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వాహనాలు నడిపేటప్పుడు వారి వెంట ధ్రువీకరణపత్రాలు తప్పకుండా వారి వెంట ఉండాలన్నారు. పలు వాహనాలను తనిఖీ చేసి అనుమతి పత్రాలు సరిగ్గా లేని వాహనాలకు అపరాధ రుసుం విధించారు. కార్యక్రమంలో చందోలు ట్రైనీ పీఎస్సై డి.రాజ్యలక్ష్మి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమం, హక్కుల సంరక్షణ బాధ్యత అధికారులదే

● కలెక్టర్ జె.వెంకటమురళి

● కార్మికులు శ్రమ దోపిడీకి గురికాకుండా చూడాలి


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జె.వెంకటమురళి

బాపట్ల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : కార్మికుల సంక్షేమం, హక్కుల సంరక్షణ బాధ్యత అధికారులదేనని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. పరిశ్రమలలో ప్రమాదాల నివారణ, ముందస్తు జాగ్రత్త చర్యలపై పరిశ్రమల యాజమాన్యం, అనుబంధ శాఖల అధికారులతో మంగళవారం కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ సంక్షేమ పథకాలను కార్మికులందరు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. కార్మికులు శ్రమ దోపిడీకి గురికాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. పని దినాలలో రోజుకు 8 గంటలే పనిచేయాల్సి ఉందన్నారు. వారానికి ఒక సెలవు తప్పనిసరిగా ఉండాలన్నారు. కోస్తాతీరప్రాంతాలుగా ఉన్న జిల్లాలో ఆక్వా, అనుబంధ పరిశ్రమలు తదితర పరిశ్రమల నుంచి వెలువడే కాలుష్యంపై కాలుష్యనియంత్రణ మండలి నివేదిక ఇవ్వాలన్నారు. సమావేశంలో కార్మిక శాఖ డిప్యూటీ చీఫ్ త్రినాథ్, డిప్యూటీ కమిషనర్ గాయత్రిదేవి, సహాయకార్మికశాఖ కమిషనర్ వెంకటశివప్రసాద్, వి.సాయిజ్యోతి, పరిశ్రమలశాఖ జిల్లా మేనేజర్ రామకృష్ణ తదితరశాఖల అధికారులు, పరిశ్రమ యజమానులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు వేగవంతం చేయాలి

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ జె.వెంకటమురళి అధికారులకు సూచించారు. పనుల పురోగతిపై కలెక్టరేట్‌లో మంగళవారం కలెక్టర్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ మండలాలలో మిగిలి ఉన్న 46 పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీవోలకు తెలిపారు. పనులకు సంబంధించిన లేబర్‌బడ్జెట్ వినియోగంపై వారికి ఇచ్చిన లక్ష్యాలను పూర్తి చేయకపోవటం గల కారణాలపై ఎంపీడీవోలను ఆరా తీశారు. ఎంపీడీవోలకు ఇచ్చిన లక్ష్యాలను నూరుశాతం పూర్తి చేయాలన్నారు. లక్ష్యాలను పూర్తి చేయటంలో ముందు వరుసలో ఉన్న ఎంపీడీవోలకు ఆగస్టు 15వ తేదీన ప్రశంస పత్రాలు అందజేసేందుకు వారి పేర్లను ప్రతిపాదించాలని డ్వామా పీడీకి తెలిపారు. మండలాలలో దిగువస్థాయి కుటుంబాలను గుర్తించి వారికి జాబ్‌కార్డులు ఇవ్వాలన్నారు.

● పీ4 కార్యక్రమంలో భాగంగా బంగారు కుటుంబాలకు మార్గదర్శులకు మ్యాపింగ్‌పై కలెక్టర్ పలు సూచనలు చేశారు. మండలాల వారీగా బంగారు కుటుంబాలను మార్గదర్శులకు మ్యాపింగ్ విషయమై గణాంకాలను పరిశీలించారు. బంగారు కుటుంబాలను మ్యాపింగ్ చేయకపోవటానికి గల కారణాలపై ఆరా తీశారు. ప్రతి మండలం, మున్సిపాలిటీలో మార్గదర్శులను గుర్తించి వారికి బంగారు కుటుంబాలను మ్యాపింగ్ చేయాలని చెప్పారు. నీడ్ బేస్డ్ సర్వేను వెంటనే పూర్తి చేయాలన్నారు. సర్వే పూర్తి చేయని అధికారులపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్వే ప్రతి మండలంలో నూరుశాతం పూర్తి చేయాలన్నారు.

పని చేయని అధికారులపై చర్యలు

జిల్లాలో డెంగీ జ్వరాల వ్యాప్తి, నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్ అధికారులకు పలు సూచనలు చేశారు. గడిచిన రెండు రోజుల్లో కొల్లూరు మండలంలో పెదలంక, చింతలంక గ్రామాలలో రెండు కేసులు, ఈదుపల్లి, యాజలిలో ఒక్కొక్క కేసు నమోదైందని వైద్యాధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. డెంగీ కేసులపై లైన్ డిపార్ట్‌మెంట్‌లన్నీ సమన్వయంతో పని చేయాలని తెలిపారు. ప్రతి మండలం, మున్సిపాలిటీలో ఎక్కడ వర్షపు నీరు ఉండకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఏగ్రామంలోనైనా డెంగీ కేసులు నమోదైతే ఆ గ్రామం మొత్తం ఇంటాబయట కాల్వలో యాంటీబయోటిక్స్ స్ప్రే చేయాలన్నారు. అధికారులు పని చేయకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

● టైఫాయిడ్ జ్వరాలు నమోదవుతున్నాయని, అవి సోకటానికి గల కారణం తాగునీటి కలుషితమేనని కలెక్టర్ తెలిపారు. తాగునీటి సరఫరాలో ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేయాలన్నారు. తాగునీటి సరఫరాలో డ్రైనేజి నీళ్ళు కలుస్తున్నాయో లేదో పర్యవేక్షించాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో డ్వామా పీడీ విజయలక్ష్మి, డీపీవో ప్రభాకరరావు, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మ, పంచాయతీరాజ్ ఈఈ వేణుగోపాల్‌రెడ్డి, డీఎల్‌డీవో విజయలక్ష్మి, చీరాల డీఎల్‌డీవో పద్మావతి, ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ పీఎం మాధవి, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నులిపురుగుల నివారణ మందులు పంపిణీ

కర్లపాలెం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : నులిపురుగుల వలన పిల్లల్లో రక్తహీనతకు దారితీసి శారీరక, మానసిక ఎదుగుదలకు ఆటంకం ఏర్పడుతుందని సర్పంచ్ చీరాల వెంకటలక్ష్మి అన్నారు. జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా మంగళవారం కర్లపాలెం మండలం ఎత్రావారిపాలెం ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయురాలు కె.జ్యోతి, ఏఎన్ఎం జయ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే పేరలి జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు నులిపురుగుల నివారణ మందులు ఆయుష్ వైద్యులు సిద్దార్ధ పంపిణీ చేశారు.

చందోలు ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాలలో...

పిట్టలవానిపాలెం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చందోలు ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాలలో మంగళవారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ప్రత్యేక వైద్యాధికారి కె.నాగరాజు ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులకు ఆల్‌బెండాజోల్ మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యశాల విస్తరణాధికారి కె.నాగేశ్వరరావు, అడ్మినిస్ట్రేషన్ అధికారి షేక్ జానీ, వైద్యాధికారులు షేక్ సుల్తానాబేగం, డాక్టర్ ఎస్.చంద్రిక, హెల్త్ సూపర్‌వైజర్ యు.నరసింహారావు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

అమృతలూరులో...

అమృతలూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : స్థానిక అమృతలూరు 1 అంగన్‌వాడీ కేంద్రంలో డీ వార్మింగ్ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి సీడీపీవో ఏ.లక్ష్మీదేవి హాజరయ్యారు. చిన్నారులకు డీ వార్మింగ్ మందు బిల్లలను అందించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ విజయలక్ష్మి, నాంచారమ్మ తదితరులు పాల్గొన్నారు.

కుండపోత వర్షంతో నీటమునిగిన వెద వరి

బాపట్ల రూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల మండలంలో సోమవారం రాత్రి సుమారు రెండు గంటలకుపైగా కుండపోత వర్షం కురిసింది. బాపట్ల మండలంలోని కంకటపాలెం, జమ్ములపాలెం, అప్పికట్ల, భర్తీపూడి, గుడిపూడి గ్రామాలలోని రైతులు వెద వరి పంటను వేశారు.

వర్షానికి వరి పంట మొత్తం నీట మునిగింది. కొంతమేర రైతులు వర్షపు నీటిని పంట కాల్వల ద్వారా బయటకు పంపించినప్పటికి మంగళవారం కూడా వర్షం కురవటంతో దిక్కుతోచని స్థితిలో రైతులు ఉన్నారు. కుండపోత వర్షం రైతులకు తీవ్ర నష్టం మిగిల్చింది.


కంకటపాలెం గ్రామ పంట పొలాలలో నిలిచిన వర్షపునీరు

పేకాట స్థావరంపై దాడి : పది మంది అరెస్టు

బాపట్ల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పటేల్‌నగర్‌లో పేకాట స్థావరంపై సీఐ ఆర్.రాంబాబు సిబ్బందితో కలిసి మంగళవారం దాడి చేశారు. పది మంది అరెస్టు చేసి వారి వద్ద ఉన్న రూ.43 వేలు స్వాధీనం చేసుకున్నారు. 10 సెల్‌ఫోన్‌లు, అయిదు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

రామాలయంలో రక్షాబంధన్, సామూహిక హారతులు


కార్యక్రమంలో మాట్లాడుతున్న రాష్ట్ర ధర్మ ప్రచారక్ ఎం.సాయిరామ్

కొల్లూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : రక్షాబంధన్, సామూహిక హారతులు కార్యక్రమాన్ని సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. కొల్లూరు గాంధీనగర్‌లోని సీతారామాలయంలో నిర్వహించిన కార్యక్రమాల్లో రాష్ట్ర ధర్మ ప్రచారక్ ఎం.సాయిరామ్ పాల్గొని మాట్లాడుతూ రక్షాబంధన్ వల్ల హిందూ ధర్మరక్షణకు, కులమత బేధాలు లేని హిందూ సమాజ నిర్మాణం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు, కన్వీనర్లు గంగాధర్, ధాత్రి అనీల్, తమ్మన సాంబశివరావు, పోస్టల్ శాఖ ఉద్యోగి శ్రీనివాసరావు, మహిళ కన్వీనర్లు గళ్లా ధనలక్ష్మి, అడపాల అన్నపూర్ణమ్మ, చిట్టా రాముడు తదితరులు పాల్గొన్నారు.

రేపు ట్రాక్టర్ల విజయోత్సవ ర్యాలీ

వేమూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సర కాలం పూర్తి కావడంతో పాటు సూపర్ సిక్స్‌లో భాగంగా అన్నదాత సుఖీభవ పథకం అమలు పరిచిన సందర్భాన్ని పురస్కరించుకుని గురువారం నియోజకవర్గంలోని రైతుల ట్రాక్టర్ల విజయోత్సవ ర్యాలీని నిర్వహించనున్నట్లు క్యాంపు కార్యాలయ వర్గాలు తెలిపాయి. ఉదయం 9.30 గంటలకు ప్రారంభమయ్యే ర్యాలీ కొల్లూరు, భట్టిప్రోలు, చుండూరు, అమృతలూరు, వేమూరు మండలాల పరిధి నుంచి 10.30 గంటలకు వేమూరుకు చేరుకుంటుందని, 11 గంటలకు సభను నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే, మాజీ మంత్రి నక్కా ఆనందబాబు ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగిస్తారని, కూటమి నాయకులు, కార్యకర్తలు, రైతులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు

రేపల్లె, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి) : పట్టణంలో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టామని మున్సిపల్ కమిషనర్ కె.సాంబశివరావు అన్నారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ వర్షాకాలం కావటంతో విషజ్వరాలు విజృంభిస్తుండటంతో దోమల నివారణకు మురుగు ప్రాంతాల్లో బ్లీచింగ్, దోమల మందు చల్లుతున్నామన్నారు. రాత్రి సమయాల్లో ఫాగింగ్ చేస్తున్నామని, దోమలు వృద్ధిచెందకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. అదేవిధంగా లెట్రిన్ గొట్టాలకు నైలాన్ నెట్స్ కట్టి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఎక్కడైనా పారిశుధ్యం క్షీణించి ఉంటే మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు తెలపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎ.రామచంద్రరావు, సెక్రటరీలు సురేంద్రకుమార్, పవన్‌కుమార్, మహేష్, కల్యాణి, ప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు.

భట్టిప్రోలులో ...

భట్టిప్రోలు (కొల్లూరు), ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : దోమల నివారణకు మందులు పిచికారీ చేశారు. మండల కేంద్రం భట్టిప్రోలులో మంగళవారం సర్పంచ్ దారా కిరణ్మయి ఆధ్వర్యంలో మురుగు కాల్వలు పూడిక తీయించి దోమల నివారణకు మందులు పిచికారీ చేయించారు. జిల్లాలో విష జ్వరాలు ప్రబలుతున్నందున కలెక్టర్ ఆదేశాలు అనుసరించి ప్రత్యేక పారిశుధ్య మెరుగు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మాంజీ నాయక్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


యాజలి గ్రామ ఎస్సీ కాలనీ ప్రధాన రోడ్డుపై ఏర్పడిన గుంతలలో నిలిచిన నీరు


పాండురంగాపురం రోడ్డు టర్నింగ్‌లో ఏర్పడిన గుంతలో నిలిచిన వర్షపునీరు

తటాకాలను తలపిస్తున్న రోడ్లు

● వాహన రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు

● పట్టించుకోని పాలకులు, అధికారులు

బాపట్ల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం మండలం యాజలి గ్రామ పంచాయతీపరిధిలోని ఎస్సీకాలనీ ప్రధాన రహదారిపై పెద్దఎత్తున గుంతలు ఏర్పడ్డాయి. గుంతల రోడ్డుపై వర్షపునీరు నిలిచి తటాకాన్ని తలపిస్తున్నది. దీనివల్ల కాలనీవాసులు, వాహనచోదకుల రాకపోకలకు తీవ్రవిఘాతం ఏర్పడుతున్నది. సంబంధితాధికారులు స్పందించి రోడ్డుపై నీరు బయటకు పంపించి గుంతలకు మరమ్మతులు చేయించాలని ఆప్రాంత ప్రజలు కోరుతున్నారు.

పాండురంగాపురం రోడ్డు...

బాపట్ల మండలం అడవిగ్రామపంచాయతీ పరిధిలోని పాండురంగాపురం రోడ్డు గోతుల మయంగా మారింది. రోడ్డు అంతా గుంతలుగా మారటంతో వాహనాల రాకపోకలకు తీవ్ర విఘాతం ఏర్పడుతున్నది. రాష్ట్ర గవర్నర్ ఈ రోడ్డు నుంచి తీరంలోని రిసార్ట్స్‌కు వెళుతూ రోడ్డు పరిస్థితిని గమనించి 8 కిలోమీటర్ల రోడ్డు నిర్మించాలని కలెక్టర్‌ను ఆదేశించారు. దీనిపై ఆర్‌అండ్‌బి అధికారులకు తగుసూచనలు చేశారు. రూ.13 కోట్లతో అంచనాలు తయారు చేసినట్లు తెలిసింది. అయితే నేటికి కార్యరూపం దాల్చలేదు. ఫలితంగా వర్షం వస్తే రోడ్డుఅంతా చెరువును తలపిస్తుంది.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనందబాబు

సమస్యలు లేకుండా రైతులకు సాగునీరందించాలి

● ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు

అమృతలూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : ఎలాంటి సమస్యలు లేకుండా రైతుల చివరి భూముల వరకు సాగునీరు అందించాలని వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ కార్యాలయం వద్ద నియోజకవర్గ స్థాయిలో ఇరిగేషన్, డ్రైనేజ్, డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షులు, రైతులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆనందబాబు మాట్లాడుతూ నీటి సంఘాలు రైతుల సమస్యలపై ప్రధాన భూమిక వహించాలన్నారు. నీటిపారుదల అధికారులతో కలసి పరస్పర సహకారంతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా పని చేయాలన్నారు. అత్యవసర మరమ్మతులను పూర్తి చేయాలని కోరారు. రైతుల వద్ద నుంచి సమస్యలు తెలుసుకుని వాటిని వెంటనే పరిష్కరించాలన్నారు. కాల్వలపై నిర్మాణాలు చేయాల్సి ఉంటే అందుకు సంబంధించిన ప్రతిపాదనలు తయారు చేసి తనకు పంపించాలని రైతులకు, అధికారులకు సూచించారు. సమావేశంలో ఏఎంసీ ఛైర్‌పర్సన్ గొట్టిపాటి పూర్ణకుమారి, ఎస్ఈ వెంకటరత్నం, ఈఈ సుధాకర్, డీఈ శ్రీనివాసరావు, కూచిపూడి డీసీ కొరటాల లీలసత్యసాయి, తమ్మా శివారెడ్డి, పులివర్తి కోటేశ్వరరావు, ఇరిగేషన్, డ్రైనేజ్ ఏఈలు, రైతులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

లబ్ధిదారునికి బీమా చెక్కు అందజేత

అమృతలూరు మండలంలోని యడవూరు గ్రామానికి చెందిన మొవ్వా సాంబశివరావు ప్రమాదవశాత్తు మృతి చెందాడు. అతనికి తెలుగుదేశం పార్టీ సభ్యత్వం కలిగి ఉండటంతో పాటు, కూచిపూడి ప్రాథమిక సహకార సంఘంలో బీమా కలిగి ఉన్నారు. సాంబశివరావు చనిపోవడంతో కూచిపూడి పీఏసీఎస్ నుంచి నామినీ అయిన భార్య సామ్రాజ్యంకు రెండు లక్షల రూపాయల చెక్కును వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, పీఏసీఎస్ ఛైర్‌పర్సన్ తుమ్మల భుజంగరావు చేతుల మీదుగా కూచిపూడిలో బీమా చెక్కును అందించారు. ఈ సందర్భంగా సాంబశివరావు పార్టీ సభ్యత్వం కలిగి ఉండటం వలన సామ్రాజ్యంకు బీమా కింద మరో రూ.5 లక్షలు ఆమె ఖాతాలో జమ చేయడం జరిగిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కొత్తపల్లి రవీంద్రబాబు, బొంతా ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్ అండ్ బీ రహదారి పునర్నిర్మించాలని రైతుల ధర్నా

కొల్లూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : అధ్వానంగా మారిన ఆర్ అండ్ బీ రహదారి పునర్నిర్మించాలని రైతులు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. మండల పరిధిలోని అనంతవరం గ్రామం వద్ద రహదారి దుస్థితిపై రైతులతో కలిసి రైతు సంఘం నాయకులు బి.సుబ్బారావు ధర్నా నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామానికి ఆర్ అండ్ బీ రహదారులు మెరుగుపరుస్తామని గత సంవత్సరం డిసెంబరులో ప్రకటించడంతో తెనాలి-చిలుమూరు ప్రధాన రహదారిని వేసే నిమిత్తం పగలగొట్టడం జరిగిందని, 8 నెలలు గడిచినా కనీసం మరమ్మతులకు కూడా నోచుకోలేదన్నారు. ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి రహదారి పునర్నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ బూసి రాంబాబు, రైతులు జాలాది రంగారావు, దూళిపాళ్ల రవి, గోళ్ల రాంబాబు, వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, అశ్విన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


తెనాలి-అనంతవరం రహదారి దుస్థితిపై ధర్నా చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు, రైతులు

లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

రేపల్లె, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : ఆపదలో ఉన్నవారిని ఆదుకునేందుకు కూటమిప్రభుత్వం ఎప్పుడు ముందుంటుందని మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. వివిధ ఆరోగ్య కారణాల వలన వైద్యం చేయించుకోలేని నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను మంగళవారం పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో వైద్యం చేయించుకోలేని పేదలకు మంత్రి అనగాని సత్యప్రసాద్ అండగా నిలుస్తున్నారన్నారు. 157 మంది లబ్ధిదారులకు కోటి ఐదు లక్షల రూపాయలు వైద్య ఖర్చుల నిమిత్తం నిధులు మంజూరు చేయించారని అన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఒక్కరికి కూడా సీఎం సహాయనిధి అందించిన దాఖలాలు లేవన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొలసానిరాము, తొట్టెంపూడి సుభాష్, గుడి అంకరాజు, సమ్మెట బసవరావు, చింతల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.


బాధితులకు సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను పంపిణీ చేస్తున్న మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్

రుణాలు బ్యాంకు ద్వారా మాత్రమే పొందాలి

చెరుకుపల్లి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కుంచాలవారిపాలెంలో చెరుకుపల్లి బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి ఆధ్వర్యంలో సోషల్ సెక్యూరిటీ స్కీంపై సదస్సు నిర్వహించారు. జన్‌ధన్ యోజన కింద సున్నా బ్యాలెన్స్‌తో గతంలో ఖాతాలు తెరిచిన వారందరూ మరలా వేలిముద్రలు వేసి ఈకేవైసీ ద్వారా తమ ఖాతాలను వాడుకలోకి తెచ్చుకోవాలని డీజీఎం సంపత్ తెలిపారు. వడ్డీ వ్యాపారుల వద్ద అధిక వడ్డీలకు నష్టపోకుండా బ్యాంకు రుణాలు పొందాలని, ప్రజలు తమ సొమ్మును బ్యాంకులో భద్రపరచుకోవటం ద్వారా సెక్యూరిటీ పొందవచ్చు అన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలు బ్యాంకు సేవలను పొంది దేశ ఆర్థికాభివృద్ధికి తోడ్పడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆప్కో మాజీ డైరెక్టర్ దివి రాంబాబు, జోనల్ మేనేజర్ బంగారురాజు, ఆపరేషన్ ప్రోగ్రామర్ సంతానం ఫణికుమార్, ఎల్‌డీఎం శివకృష్ణ, బ్రాంచ్ మేనేజర్ సుజీవరాణి, క్రెడిట్ ఇన్‌చార్జ్‌లు మాధవి, నర్మదా, పంచాయతీ కార్యదర్శి గౌస్ రబ్బాని, స్థానికులు, మహిళలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆప్కో మాజీ డైరెక్టర్ దివి రాంబాబు



రెవెన్యూ అధికారులు సీజ్ చేసిన ఎక్స్‌కవేటర్



సీజ్ చేసిన టిప్పర్

కలెక్టర్ చెబితే కానీ.. కనిపించలేదు

- త్రిపురాపురం కొండ వద్ద అక్రమ మైనింగ్
- పిడుగురాళ్ళ వెళ్తూ గమనించిన కలెక్టర్
- రెవెన్యూ అధికారులకు ఆదేశాలు
- ఎక్స్‌కవేటర్, టిప్పర్‌ను సీజ్ చేసిన రెవెన్యూ అధికారులు
- అధికారుల పాత్రపై కూడా అనుమానాలు

నకరికల్లు ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): నకరికల్లు మండలం త్రిపురాపురం కొండ వద్ద ఎన్నో నెలలుగా జరుగుతున్న అక్రమ మైనింగ్‌ను ఎట్టకేలకు రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు మంగళవారం పిడుగురాళ్ల వెళ్తూ త్రిపురారం కొండ వద్ద జరుగుతున్న అక్రమ మైనింగ్‌ను గమనించారు. వెంటనే అక్రమ మైనింగ్‌ను నిలిపివేయాలని తహసీల్దార్ పుల్లారావుకు అక్కడ నుంచే ఆదేశాలు జారీ చేశారు. దీంతో హుటాహుటిన తహసీల్దార్ పుల్లారావు ఆర్ఐ తోట సిద్ధయ్య, వీఆర్వో జెండా మౌలాలి మైనింగ్ ప్రాంతానికి వెళ్లి అక్కడ ఉన్న ఒక ఎక్సకవేటర్, టిప్పర్‌ను సీజ్ చేశారు. అక్రమ మైనింగ్ విషయాన్ని మైనింగ్ అధికారులకు సమాచారం ఇచ్చి కేసు నమోదు చేస్తున్నట్లు తహసీల్దార్ పుల్లారావు తెలిపారు. కలెక్టర్ ఆదేశాలిచ్చే వరకు స్థానిక రెవెన్యూ అధికారులు అక్రమ మైనింగ్ వ్యవహారం తెలియకుండా ఉందా అనే చర్చ విస్తృతంగా ఉంది. అందరు అధికారులకు తెలిసే తవ్వకాలు జరుగుతున్నాయి అనేది బహిరంగ రహస్యం. అయితే ఈ వ్యవహారంలో కలెక్టర్ తదుపరి చర్యలు ఏమి ఉంటాయో వేచి చూడాల్సిందే.

పౌరులు దేశభక్తితో అభివృద్ధిపథంలో సాగాలి

- బీజేపీ ఈస్ట్ ఇన్‌ఛార్జ్ డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్



జాతీయ పతాకాలతో డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్ తదితరులు

గుంటూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): పౌరులంతా దేశభక్తితో దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని బీజేపీ ఈస్ట్ ఇన్‌ఛార్జ్ డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్ పిలుపునిచ్చారు. రాష్ట్ర పార్టీ సూచనల మేరకు హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా కొత్తపేట డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్ కార్యాలయలో మంగళవారం 14వ మండల సమావేశం ఏర్పాటుచేశారు. డాక్టర్ ఉమాశంకర్ మాట్లాడుతూ 2047 నాటికి మన దేశం ప్రపంచదేశాలలోనే నెం.1 స్థానంలో నిలబెట్టటానికి ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. అనంతరం జాతీయ జండాలతో ర్యాలీగా నాజ్‌సెంటర్ చేరుకుని మాజీ ప్రధాని వాజపేయి, స్వాతంత్ర సమరయోధుడు అల్లూరి సీతారామరాజు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు సురేష్‌కుమార్‌జైన్, దేసు సత్యనారాయణ, నారాయణ రెడ్డి, మండల అధ్యక్షుడు మలిశెట్టి పవన్‌కుమార్, మండల పదాధికారులు దేవిశెట్టి బాబురావు, మైలవరపు ప్రవీణ్, జూలకంటి సుబ్రహ్మణ్యం, తల్లం మనోజ్, వేమూరి అనీల్ తదితరులున్నారు.

స్పెషల్ ట్రైన్ ప్రతిపాదించరా...!



- గురువారం నుంచి ఆదివారం వరకు ఇరువైపులా రైళ్లలో రిగ్రెట్‌లు
- ఎన్ఐ వర్కులతో రద్దు అయిన వాటిల్లో ఒక రైలు నడిపినా ఉపయోగమే
- మచిలీపట్నం/విజయవాడ - గుంటూరు - సికింద్రాబాద్‌కు డిమాండ్

గుంటూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఒకపక్క దుగ్గిరాల - తెనాలి - చుండూరు మధ్యన ప్రీఎన్ఐ, ఎన్ఐ, పోస్టు ఎన్ఐ వర్కుల కారణంగా పలు రైళ్ల రద్దు. కొన్ని దారి మళ్లింపు. మరోవైపు వారాంతం మూడు సెలవుదినాలతో హెవీ రష్. ఇప్పటికే గుంటూరు - సికింద్రాబాద్, గుంటూరు - బెంగళూరు మధ్యన రాకపోకలు సాగించే అన్ని రైళ్లలో ఇరువైపులా టిక్కెట్ బుకింగ్ చేసుకోవడానికి వీలు లేకుండా రిగ్రెట్‌లు. ఇంత డిమాండ్ ఉన్నప్పటికీ ఒక ప్రత్యేక రైలుని దక్షిణ మధ్య రైల్వే జోన్‌కు ప్రతిపాదించి ఆమోదం తీసుకోవడంలో డివిజనల్ రైల్వే అధికారులు మీనమేషాలు లెక్కిస్తోన్నారు. ప్రస్తుతం పలు రైళ్ల సర్వీసులు రద్దు కావడంతో అవి ఖాళీగా కోచ్ మెయిన్‌టెనెన్స్ డిపోల్లో ఉన్నాయి. వాటిల్లో ఒక దానిని మచిలీపట్నం/విజయవాడ నుంచి గుంటూరు మీదగా సికింద్రాబాద్, మరో రైలు బెంగళూరుకు నడిపితే ఇటు ప్రయాణీకులకు, అటు రైల్వేకు ఉపయోగకరంగా ఉంటుందని రైల్వే వినియోగదారుల సంఘాల నాయకులు సూచిస్తున్నారు.

ఈ నెల 15 స్వాతంత్ర్య దినోత్సవం, 16న కృష్ణాష్టమి, 17న ఆదివారం సెలవు దినాలు కావడంతో 14వ తేదీ మధ్యాహ్నం నుంచే ఇరువైపులా రైళ్లకు రద్దీ తలెత్తింది. ఇప్పటికే గుంటూరు మీదగా బెంగళూరు, సికింద్రాబాద్‌కు రాకపోకలు సాగించే అన్ని రైళ్లలో టిక్కెట్‌లు బుకింగ్ అయిపోయాయి. వెయిటింగ్ లిస్టులో కూడా బుకింగ్ చేయడానికి వీలు లేకుండా రిగ్రెట్ పడిపోయింది. మరోవైపు ప్రైవేటు బస్సు ఆపరేటర్లు ఇప్పటికే టిక్కెట్ ఛార్జీలను మూడు, నాలుగు రెట్లు పెంచేశారు. ఈ పరిస్థితుల్లో రైల్వే శాఖ ఒక ప్రత్యేక రైలుని ఈ మూడు రోజుల్లో ప్రకటిస్తుందానని ప్రయాణీకులు ఎదురు చూస్తున్నారు.


రేక్‌లకు కొదవ లేదు...

నిత్యం విజయవాడ - గూడూరు మధ్యన రాకపోకలు సాగించే విక్రమ సింహపురి ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ సర్వీసుని ఈ నెల 11 నుంచి 20వ తేదీ వరకు రద్దు చేశారు. ఈ కారణంగా సెకండ్ సిట్టింగ్, ఏసీ ఛైర్‌కార్ బోగీలతో ఉన్న పూర్తి స్థాయి రేక్ స్పెషల్ ట్రైన్ నడపడానికి అందుబాటులో ఉన్నది. అలానే డబుల్ డెక్కర్ రైలు కూడా ఖాళీగానే ఉన్నది. నరసపూర్ - ధర్మవరం ఎక్స్‌ప్రెస్ రైలు రేక్ కూడా ఖాళీగానే ఉన్నది. ఈ నేపథ్యంలో స్పెషల్ నడపడానికి ఎలాంటి రేక్ కొరత లేదు. చేయాల్సిందల్లా గుంటూరు, విజయవాడ డివిజన్‌ల అధికారులు మాట్లాడుకొని ఒక స్పెషల్‌ని జోన్‌కు ప్రతిపాదించడమే.

యమ్మాజీగూడెంపై వివక్ష



యమ్మాజీగూడెం ఏరియల్ వ్యూ



యమ్మాజీగూడెంలోకి చేరిన కృష్ణానది నీరు

- సగం గ్రామస్థులకే పరిహారం
- పులిచింతల నీటి నిల్వతో కష్టాలు

బెల్లంకొండ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ముంపులోని యమ్మాజీగూడెంలో సగం గ్రామానికి, సగం ఇళ్లకు మాత్రమే నష్ట పరిహారం అందింది. మిగిలిన గ్రామస్థుల గురించి అటు అధికారులు, ఇటు పాలకులు పట్టించుకోవడం లేదు. దీంతో ప్రాజెక్టులో నీరు నిల్వ చేసిన ప్రతిసారి గ్రామస్థులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. ముంపు సమయంలో గ్రామస్థులను సురక్షిత ప్రాంతాలకు తరలించడంతో అధికారులు సరిపెడుతున్నారు. శాశ్వత పరిష్కారం చూపించడంలో అధికారులు విఫల మవుతున్నారు. వన్ టైమ్ సెటిల్‌మెంట్ కింద నష్ట పరిహారం ఇవ్వాలని గ్రామస్థులు కోరుతున్నారు. ప్రభుత్వాలు మారుతున్నా తమను పట్టించుకున్న నాధుడే లేడని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం గ్రామంలో 126 గృహాల్లో ప్రజలు నివసిస్తున్నారు. వారంతా చీకట్లోనే మగ్గుతూ పొలాలు సాగు చేసుకుంటున్నారు. ప్రాజెక్టులో నీరు నిల్వ చేసిన సమయంలో గ్రామంలోకి నీరు ప్రవేశించి ఇళ్లల్లోకి విష సర్పాలు వస్తున్నాయని, పొలాలు మునిగి పోతున్నాయని గ్రామస్థులు వాపోతున్నారు. పీసీపీ నెంబర్లు ఇచ్చిన గృహాల యజమానులు సుమారుగా 30 నుంచి 40 మంది వరకు మృతి చెందారు. దీంతో తమ పరిస్థితి ఏమిటో అర్థం కావడం లేదని ఆయా కుటుంబాల వారు వాపోతున్నారు.


రేపు గుంటూరులో ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పర్యటన

- అధికారులతో సమీక్ష

గుంటూరు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ ఛైర్మన్, మేనేజింగ్ డైరక్టర్ పీ పుల్లారెడ్డి, టెక్నికల్ డైరక్టర్ ఆవుల మురళీకృష్ణయాదవ్‌లు ఈనెల 14న గుంటూరులో పర్యటించనున్నారు. ఈ మేరకు గుంటూరు జిల్లా అధికారులకు సమాచారం అందించారు. జిల్లాలో రెవెన్యూ బకాయిలతో పాటు వ్యవసాయ కనెక్షన్‌లు, స్మార్ట్ మీటర్ల ఏర్పాటు, ఆర్‌డిఎస్ఎస్ పథకం పనుల పురోగతి, పీఎం సూర్య ఘర్ పథకం వంటి వివిధ అంశాలపై సమీక్షించనున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఈ సందర్భంగా సీఎండీ క్షేత్ర స్థాయిలో డివిజనల్, సెక్షన్ కార్యాలయాలను కూడా సందర్శించనున్నట్లు సమాచారం. ఈ మేరకు సర్కిల్ ఆపరేషన్ ఎస్ఈ చల్లా రమేష్ డివిజనల్ స్థాయి అధికారులకు తగు సమాచారంతో సీఎండీ సమీక్షా సమావేశాలకు రావాలని ఆదేశాలు జారీ చేశారు. ఇందులో భాగంగా మంగళవారం పల్నాడు జిల్లా సర్కిల్ కార్యాలయంలో సీఎండీ పుల్లారెడ్డి, టెక్నికల్ డైరక్టర్ మురళీకృష్ణయాదవ్‌లు పర్యటించి సమీక్షా సమావేశం నిర్వహించారు. కాగా బుదవారం గుంటూరులో సీఎండీ పర్యటించాల్సి ఉండగా గురువారానికి వాయిదా పడింది.

ఏడు పదుల్లోనూ.. పరిమళిస్తున్న ప్రమీల

- చరిత్ర పరిశోధక రచయిత్రిగా వేమూరు వాసి



ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందనలు అందుకుంటున్న లక్ష్మీప్రమీల (ఫైల్)



మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడుకు పేరంటాళ్లు పుస్తకాన్ని అందజేసి అభినందనలు అందుకుంటున్న లక్ష్మీప్రమీల

వేమూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఆమె వయస్సు ప్రస్తుతం 76 సంవత్సరాలు. సాధారణంగా ఎవరైనా అయితే కృష్ణా రామా.. అంటూ కాలం గడుపుతారు. కానీ వేమూరు గ్రామంలో రైతు కుటుంబంలో జన్మించిన కోగంటి లక్ష్మీప్రమీల చరిత్ర పరిశోధనా రచయిత్రిగా పరిమళిస్తోంది. ఇటీవల డాక్టర్ లక్ష్మీప్రమీల వేమూరు విజ్ఞాన సర్వస్వం గ్రంథాన్ని రచించారు. కథలు, కవితలు, నవలా రచనలతో రచయిత్రులు ఎక్కువగా ఉంటారు. చరిత్ర అన్వేషకులు, చరిత్రకారులు అరుదు. అయితే లక్ష్మీప్రమీల చరిత్రపై ఇష్టంతో లేటు వయసులో విద్య ప్రారంభించి వయస్సును లెక్క చేయకుండా క్షేత్ర పర్యటనల ద్వారా పరిశోధన ఫలితాలను పుస్తక రూపంలో అందించారు. 1949లో కోగంటి వెంకటరత్నమ్మ, వెంకటసుబ్బయ్యలకు జన్మించిన ఆమె వేమూరులోనే ఎస్ఎస్ఎల్‌సీ వరకు చదివారు. 1967లో రైల్వే ఉద్యోగి శివసత్యనారాయణతో ఆమెకు వివాహమైంది. భర్త ఉన్నత చదువుకు అంగీకరించలేదు. భర్త ఉద్యోగవిరమణ అనంతరం.. పిల్లలకు పెళ్లిళ్లు అయ్యాక ఆమె సిద్ధసమాధి యోగా శిక్షణ పొందారు. యోగా ఆమె జీవితాన్ని మలుపుతిప్పింది. చదువు ఆపిన 36 ఏళ్లకు అనగా 55 సంవత్సరాల ప్రాయంలో భర్త అనుమతితో నాగార్జున యూనివర్సిటీలో బీఏ, ఎంఏ పూర్తి చేశారు. పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీలో ఎంఫిల్ చేసి పీహెచ్‌డీ పట్టా పొందారు. 56వ ఏటా భగవద్గీతలోని 108 శ్లోకాలు కంఠస్థం చేసి పారాయణాలు నిర్వహించారు. 55వ ఏట యోగా పోటీల్లో ఆరు సార్లు జాతీయ స్థాయి, రాష్ట్ర స్థాయిలో గోల్డ్, సిల్వర్ మెడల్స్ సాధించారు. 2008లో విజయవాడలో జరిగిన 10కే రన్‌లో గోల్డ్‌మెడల్ పొందారు. భర్త, పిల్లల ప్రోత్సాహంతో ముందుకు వెళుతున్న ప్రమీల పొట్టి శ్రీరాములు విశ్వ విద్యాలయం ద్వారా చరిత్ర, సంస్కృతి, పురావస్తు శాస్త్ర పీఠం శ్రీశైలం ప్రాంతీయ, స్థానిక, స్థల, గ్రామ చరిత్రలపై అధ్యయనం ప్రారంభించారు. వేమూరు గ్రామ సాంఘిక పరిస్థితులు, రాజకీయ, మత, సాంస్కృతిక పరిస్థితులు పరిశీలన అనే అంశంపై పరిశోధించి 2012లో హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగిన స్నాతకోత్సవంలో ఉపకులపతి డాక్టర్ ఎల్లూరి శివారెడ్డి నుంచి ఎంఫిల్ పట్టా అందుకున్నారు. పేరంటాళ్లు - చారిత్రక అధ్యయనం అంశంపై పరిశోధన చేశారు. 69వ ఏట డాక్టరేట్ పొందిన ఆమె 2018లో తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ అధ్యక్షులు చింతపట్ల వెంకటాచారి నుంచి మల్టీ టాలెంటెడ్ ఉమెన్ బహుముఖ ప్రజ్ఞశాలిగా అవార్డులు, గోల్డ్‌మెడల్, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ నుంచి లైఫ్ టైం ఎచీవ్‌మెంట్ అవార్డు అందుకున్నారు. పేరంటాళ్లు గ్రంథానికి ఉత్తమ పరిశోధక గ్రంథంగా గుర్తించి కల్చరల్ సెంటర్ ఆఫ్ విజయవాడ, అమరావతి పురస్కారాన్ని అందుకున్నారు. 2019లో సరస భారతి అధ్యక్షులు గబ్బిట దుర్గాప్రసాద్ నుంచి స్వయాసిద్ధ ఉగాది పురస్కారం అందుకున్నారు. 2023లో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు సత్కరించి అభినందించారు. వేమూరులోని తమ తండ్రి సాగు భూమి ప్రాంతంలో కొన్ని చరిత్ర ఆనవాళ్ళు ఆధారంగా వేమూరు విజ్ఞాన సర్వస్వం గ్రంథాన్ని ప్రారంభించారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై సమరం

(5వ పేజీ తరువాయి)

ప్రారంభించి ప్రసంగించారు. భవిష్యత్తుతరాలకు పర్యావరణాన్ని రక్షించడానికి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిర్మూలించడానికి ప్రజల్లో అవగాహన కల్పించడంలో యువత కీలక పాత్ర పోషించాలన్నారు. ప్లాస్టిక్‌ను నిర్మూలించడం పరిశుభ్రతకు సంబంధించిన విషయమే కాదని, బాధ్యతాయుతమైన సంస్కృతిని సృష్టించే అంశమన్నారు. పరిశుభ్రత, పచ్చదనంతో పర్యావరణహిత సింగిల్ యూజ్‌డ్ ప్లాస్టిక్ రహిత రాజధానిగా అమరావతిని తీర్చిదిద్దేందుకు రెడ్‌క్రాస్ సొసైటీ లక్ష్యంగా ఏర్పాటు చేసుకున్నట్లు చెప్పారు.

పైలెట్ ప్రాజెక్టుగా గుంటూరు..

యూత్, జూనియర్ రెడ్‌క్రాస్‌ల ఆధ్వర్యంలో దేశంలోనే మొట్టమొదటిసారి ప్లాస్టిక్ నివారణ ఉద్యమం గుంటూరులో ప్రారంభించడం సంతోషంగా ఉన్నదని తెలిపారు. రెడ్‌క్రాస్ రాష్ట్ర కోశాధికారి రామచంద్రరాజు నాయకత్వంలో పైలట్ ప్రాజెక్టుగా గుంటూరును ఎన్నుకున్నట్లు గవర్నర్ తెలిపారు. సాంస్కృతికంగా, విద్యాపరంగా ప్రత్యేకమైన స్థానం ఉన్న గుంటూరు నాయకత్వానికి ప్రసిద్ధి చెందినదని చెప్పారు. అందుకే ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సంస్థ సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై యద్ధాన్ని ఇక్కడి నుంచే ప్రారంభిస్తున్నదని చెప్పారు. ఇక్కడ విజయవంతమైతే కచ్చితంగా అది రాష్ట్రమంతటా విస్తరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గుంటూరు నగరంలో 50 వేల మంది జూనియర్ రెడ్ క్రాస్ విద్యార్థుల ద్వారా వారి కుటుంబ సభ్యులను ప్రేరేపించి, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నివారణకు రెడ్‌క్రాస్ కృషి చేస్తుందని తెలిపారు.

విద్యార్థులకు అభినందనలు..

ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఎస్తేరు రాణి, లౌఖ్యలను గవర్నర్ నజీర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ ఇద్దరు విద్యార్థినులు సోషల్ సర్వీసు కింద ప్రతీ మూడో శనివారం ప్రజల వద్దకు వెళ్లి సింగిల్ యూజ్ ప్లాసిక్ వల్ల కలిగే అనర్థాలు, ఏపీ వాతావరణ కార్యాచరణ గురించి వివరించి రెడ్‌క్రాస్ యాప్‌లో అప్‌లోడింగ్ చేస్తారు. వీరు చేస్తోన్న సర్వీసుని గవర్నర్ ప్రశంసించారు. తొలుత రెడ్ క్రాస్ వ్యవస్థాపకుడు హెన్నీడ్యునాంట్ చిత్రపటానికి గవర్నర్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏకే పరీదా, గవర్నర్ ఎక్స్ ఆఫిషియో సెక్రటరి డాక్టర్ ఎం హరిజవహర్‌లాల్, రెడ్ క్రాస్ ఏపీ రాష్ట్ర శాఖ ఛైర్మన్ వైడీ రామారావు, కోశాధికారి పీ రామచంద్రరాజు, గుంటూరు జిల్లా బ్రాంచ్ ఛైర్మన్ వడ్లమాని రవి తదితరులు పాల్గొన్నారు. గవర్నర్‌కు కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ సతీష్‌కుమార్, ఎమ్మెల్యేలు బూర్ల రామాంజనేయులు, మహమ్మద్ నసీర్ అహ్మద్, గళ్లా మాధవి, నగరపాలక సంస్థ కమిషనరు పులి శ్రీనివాసులు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు.

అమరుల త్యాగం అజరామరం

(5వ పేజీ తరువాయి)

గాలి రామకోటయ్య, ప్రయాగ రాఘవయ్య, జాస్తి అప్పయ్యల స్థూపాల వద్ద పూలు సమర్పించి నివాళులర్పించారు. ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ క్యాడెట్ల గౌరవ వందనం చేయించారు. అనంతరం జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ, స్వాతంత్ర్య పోరాటంలో తెనాలిలో జరిగిన సంఘటన దేశం మొత్తం ఉలికిపాటుకు గురి చేసిందని, ప్రతి ఒక్కరిలో స్ఫూర్తి రగిలించిందన్నారు. సమరయోధులు మనపై పెట్టిన గురుతర బాధ్యతను నెరవేర్చాలన్నారు. కోట్లాది మంది పోరాటం, పోరాట పటిమ, త్యాగ నిరతితో దేశానికి సిద్ధించిన స్వాతంత్ర్యాన్ని కుల, మతబేధాలు విడిచి కాపాడుకోవాలన్నారు. మహిళా కమిషన్ మాజీ ఛైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి మాట్లాడుతూ కులమతాల అడ్డుగోడలు నిర్మించుకుని ఎందరో త్యాగాలతో వచ్చిన స్వాతంత్ర్యానికి విలువ లేకుండా చేయవద్దని కోరారు. సమాజసేవ చేస్తున్న పలువురు పట్టణ ప్రముఖులను ఘనంగా సన్మానించారు. సబ్ కలెక్టర్ సంజన సింహా, మున్సిపల్ ఛైర్‌పర్సన్ రాధిక, కమిషనర్ లక్ష్మీపతిరావు, తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ, డీఎస్పీ జనార్ధనరావు, లెఫ్టినెంట్ కల్నల్ ఉదయ్‌కుమార్, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

మాఫియా మంత్రగాడు..

(5వ పేజీ తరువాయి)

చూసీచూడనట్లు వదిలేయడం అధికార యంత్రాంగం పని. ఏదైనా సమస్యవస్తే వాటిని పరిష్కరించడం ప్రజాప్రతినిధుల పని. పాతగుంటూరు, ప్రత్తిపాడు, సత్తెనపల్లిలో మిల్లులు నడుపుతున్న ఓ మిల్లర్, గుంటూరు ఆర్టీసీ కాలనీలోని మరో మిల్లర్ ఈ వ్యవహారం మొత్తంలో అత్యంత కీలకంగా ఉన్నాడు.

ఆధిపత్య పోరులోనూ చక్రం..

ఇటీవల రేషన్ మాఫియాలో ఆధిపత్య పోరు నెలకొంది. ఎప్పటి నుంచో మాఫియాపై పట్టున్న డాన్‌పై కొంతమంది తిరుగుబాటు చేసి సొంత ముఠా పెట్టుకున్నారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గం కేంద్రంగా బియ్యాన్ని సేకరించారు. దీంతో మంత్రగాడు ఆ ముఠాపై కన్నెర్ర చేశాడు. ఐదారు నెలలుగా బియ్యాన్ని సేకరించిన కొత్త ముఠా బియ్యాన్ని సొమ్ము చేసేవారు లేక అల్లాడిపోయారు. చివరకు వారే తరలించేందుకు సిద్ధమవగా అధికారులకు, పోలీసులకు సమాచారం ఇచ్చి వారిని పట్టించారు. ఇలా గడిచిన ఐదారు నెలల్లో కొత్తగా పుట్టుకొచ్చిన మరో మాఫియా డాన్ నేత రూ.70 లక్షల మేర నష్టపోయి చేతులెత్తేశాడు. తాజాగా గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో మరొకరు ముందుకొచ్చారు. ఈ వారంలోనే అతడి వాహనాలు అధికారుల చేతిలో పడ్డాయి. దీంతో అతడి పని కూడా అయిపోయింది. ఇలా ఈ మాఫియా డాన్ తిరుగులేని ఆధిపత్యాన్ని చెలాయిస్తున్నాడు.

రైతన్నా.. జాగ్రత్త





- సాగు సమయంలో పాములతో అప్రమత్తం
- ప్రభుత్వ వైద్యశాలకు పెరుగుతున్న పాముకాటు కేసులు
- పూర్తి ఉచితంగా పాము కాటు విరుగుడు ఇంజక్షన్లు
- నాటు వైద్యాల జోలికి వెళితే ఇబ్బందులు తప్పవు

సత్తెనపల్లి, తెనాలి రూరల్ ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): అసలే వర్షా కాలం, పంట పొలాల్లో పాముల సంచారం అధికంగా ఉండేకాలం. ఖరీఫ్ పనుల్లో నిమగ్నమైన అన్నదాతలు అప్రమత్తంగా ఉండాల్సిన సమయం. పంట పొలాలకు వెళ్ళే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. ప్రతి సంవత్సరం ఈ సీజన్‌లో విష సర్పాల కాటుకు ఎంతో మంది రైతులు, రైతు కూలీలు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో తగిన జాగ్రత్తలు తీసుకోవటం శ్రేయస్కరం. పాము లేదా విష కీటకాలు ఏమైనా కాటు వేస్తే తక్షణమే ఆస్పత్రికి వెళ్ళి వైద్య సేవలు పొందాలి. నిర్లక్ష్యం వహిస్తే ప్రాణాలకే ముప్పు. పాము కాటుకు గురైన వ్యక్తి ఒత్తిడికి గురి కాకుండా చూసుకోవాలి. తద్వారా ప్రమాదం నుంచి బయట పడవచ్చు.

పాములన్నీ విష పూరితం కాదు

పాములన్నీ విషపూరితం కాదు, 15శాతం పాములతోనే ప్రమాదం ఉంది. అదేవిధంగా 50 శాతం పాముకాటులు ప్రమాదం లేనివే. గాయమైతే చికిత్స చేసుకుంటే నయమవుతాయి. నాగుపాము, రక్తపింజర, కట్లపాము, కొండ చిలువ తదితర పాములు విషసర్పాలుగా చెప్పవచ్చు. జెర్రిపోతు వంటి పాములు కాటువేసినా ఏమాత్రం ప్రమాదం కాదు. కాని చికిత్స అవసరం.

అది ఏ మాత్రం పని చేయదు

పాము కాటుకు గురైన వారు ఎట్టి పరిస్థితుల్లోను టెన్షన్ పడకూడదు. ఆందోళన చెందితే గుండెపోటుకు గురయ్యే అవకాశాలు ఉన్నాయి. ప్రాథమిక చర్యగా కాటువేసిన భాగంలో కట్టు కట్టాలి. వెంటనే చికిత్స నిమిత్తం దగ్గర్లోని ఆస్పత్రికి వెళ్ళాలి. ఏ పాము కాటువేసిందో బాధితులు చెబితే దానికి తగిన చికిత్సను వైద్యులు అందిస్తారు. పాముకాటు వేసినచోట కొన్ని రకాల ఆకుపసర్లను పిండటం మంచిదికాదు. మరి కొందరు యంత్రాలను నమ్ముతారు. అవి ఏమాత్రం పనిచేయవు. అలాచేస్తే ప్రాణాలకే ముప్పు. పసరమందులు నమ్మి ప్రాణాల మీదకు తెచ్చుకోకూడదు.

ఈ జాగ్రత్తలు తీసుకోవాలి

ధాన్యపు గాదెలు, గడ్డి వాముల పరిసరాలు, తడిగా ఉన్న ప్రాంతాల్లో పశువుల పాకల్లో ఎండుకలప, పిడకలు తీసే క్రమంలో, సాగునీటి నిర్వహణ కోసం పంటపొలాల్లో పనుల నిమిత్తం వెళ్ళే సమయంలో జాగ్రత్తలు పాటించాలి. రాత్రి సమయాల్లో పంటపొలాలకు వెళ్ళాల్సివస్తే చేతికర్ర, టార్చ్‌లైట్ వినియోగించాలి. ఇంటి పరిసరాల్లో పిచ్చిమొక్కలు పెరగకుండా చూసుకోవాలి. పంటపొలాలకు వెళ్ళే దగ్గరలో ఉండే ఇళ్ళవద్ద పాములు సంచరించే అవకాశం ఉంది. ఈ వర్షాలకు పొలాల్లో పాములు సంచరిస్తాయి. రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

నాటుమందుల జోలికి వెళ్లవద్దు

పాముకాటుకు గురైన వారు గ్రామాల్లో అధికంగా ఉంటున్నారు. నాటువైద్యం పేరుతో పసరు కళ్లలో పోయించుకోవడం, మెడకు మాలలు వేయడం వంటివి చేసి చివరాఖరకు వైద్యశాలను సంప్రదించే వారు లేకపోలేదు. దీనివల్ల పాము విషం కాస్త శరీరంలోని అన్ని భాగాలకు చేరి వైద్యం కష్టతరంగా మారే ప్రమాదం ఉంది.

చికిత్స చేయించుకోవాలి

విష సర్పాలు, విష కీటకాలు కాటు వేసిన వెంటనే ఆస్పత్రిని ఆశ్రయించాలి. విధిగా విరుగుడు ఇంజక్షన్‌లు తీసుకోవాలి. ఇలా చేయటం ద్వారా సకాలంలో రోగులు కోలుకుంటారు. ఏరియా వైద్యశాల లో మందులు అందుబాటులో ఉన్నాయి.

- డాక్టర్ లక్ష్మణరావు, ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్, సత్తెనపల్లి



అందుబాటులో వైద్యం

పాము కాటుకు గురైన వారికి అందుబాటులో వైద్య సేవలు ఉన్నాయి. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో, ఏరియా వైద్య సేవల్లో యాంటీ స్నేక్ ఇంజక్షన్లు అందుబాటులో ఉన్నాయి. సకాలంలో ఆస్పత్రులకు వెళ్ళటం వల్ల ప్రాణాపాయం నుంచి బయట పడవచ్చు. పాము కాటుకు గురైనవారు వైద్యుల సలహాలు, సూచనలు పాటించాలి.

లారీ బోల్తా

తప్పిన ప్రమాదం

చీరాల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : కలకత్తా నుంచి చెన్నై వెళుతున్న ఎలక్ట్రికల్ లోడుతో వెళ్తున్న ఓ లారీ చీరాల - వేటపాలెం మధ్య మన్నం అపార్ట్‌మెంట్ సమీపంలో బోల్తా పడింది. ఈ ఘటన మంగళవారం ఉదయం చోటుచేసుకుంది. బోల్తా కొట్టి సైడు కాలువలోకి దూసుకుపోయిన లారీలోపల నుంచి డ్రైవర్, క్లీనర్ స్వల్ప గాయాలతో బయట పడ్డారు. ఆ సమయంలో ఎటువంటి వాహనాల రాకపోకలు లేకపోవడంతో ఎటువంటి ప్రమాదం జరగలేదు. డ్రైవర్ నిద్రమత్తు కారణంగా ప్రమాదం జరిగిందని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు.

విద్యుత్ లైన్ ఆధునికీకరణకు వినతి

చీరాల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం మండలం పందిళ్లపల్లి పంచాయతీ గౌడ పాలెంలో విద్యుత్ ఆధునికీకరణ చేపట్టాలని గ్రామస్థులు కోరారు. ఈక్రమంలో మంగళవారం టీడీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి మహేంద్రనాథ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామంలో ప్రస్తుతం సింగిల్ ఫేజ్ కావడంతో లో ఓల్టేజ్ సమస్యలు ఉన్నట్లు చెప్పారు. త్రీ ఫేజ్ లైన్ ఏర్పాటు చేసి సమస్య పరిష్కరించాలని గ్రామస్థులు కోటేశ్వరరావు, ఆంజనేయులు, సుబ్బారావు, వెంకటేశ్వర్లు, నరేంద్ర, సత్యనారాయణ కోరడంతో దీనిపై మహేంద్రనాథ్ సానుకూలంగా స్పందించారు.

14న విద్యోన్నతి ఫౌండేషన్ ఉపకార వేతనాల పంపిణీ

పంగులూరు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి) : ధూళిపాళ్ల వెంకటేశ్వర్లు, బోడెంపూడి రామమూర్తి స్మారక ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉపకార వేతన పంపిణీ కార్యక్రమం ఈ నెల 14వ తేదీన పంగులూరు ఉన్నత పాఠశాలలో జరుగుతుందని విద్యోన్నతి ఫౌండేషన్ డైరెక్టర్ ధూళిపాళ్ల వీరనారాయణ తెలిపారు. ఇంకొల్లు, పంగులూరు, అద్దంకి మండలాల పరిధిలో 10వ తరగతి విద్యార్థులకు నిర్వహించే పోటీపరీక్షలో ఎంపికైన 15 మందికి(మండలానికి ఐదుగురు చొప్పున) ఇంటర్ విద్య కొనసాగింపునకు ఒక్కొక్కరికి 10 వేల నగదుసాయం అందచేయనున్నట్లు తెలిపారు. జూనియర్, సీనియర్ ఇంటర్ చదివే 30 మంది యోగ్యత కలిగిన విద్యార్థులకు రూ.3 లక్షల నగదును గురువారం పంగులూరులో విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ చేతులమీదుగా అందజేయనున్నట్లు తెలిపారు.

ఎరువులపై రైతులకు అవగాహన అవసరం

యద్దనపూడి/మార్టూరు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి) : యద్దనపూడి మండలంలోని తనుబొద్దివారిపాలెం, మున్నంగి వారిపాలేల్లో మంగళవారం వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ సహకారంతో రైతులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. పర్చూరు ఏడీఏ ప్రవీణ మాట్లాడుతూ పప్పుధాన్యర పంటలలో ఎరువుల వినియోగం, వాటి సస్యరక్షణ పద్ధతులను రైతులకు వివరించారు. వ్యవసాయ అధికారి కుమారి మాట్లాడుతూ మొక్కజొన్న పంట సాగులో మెళకువలను రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆత్మ ఏటీఎం హారిక, వీఏఏ సుదర్శన్, సర్పంచ్ అన్నపూర్ణమ్మ పాల్గొన్నారు.

రెండు స్కూళ్లకు ఉత్తమ అవార్డులు

ఒంగోలు విద్య, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రెండు స్కూళ్లు రాష్ట్ర స్థాయి ఉత్తమ పాఠశాలల అవార్డుకు ఎంపికయ్యాయి. ఈనెల 15న స్వాతంత్ర్య వేడుకల్లో ఈ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అవార్డులను ప్రదానం చేయనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అలాంటి స్కూళ్లు పది ఉండగా అందులో రెండు మన జిల్లా నుంచే కావడం గర్వకారణం. 2024-25 విద్యా సంవత్సరంలో ఉత్తమ ప్రతిభను కనబర్చినందుకు నాగులుప్పలపాడు మండలం అమ్మనబ్రోలు ఏపీ రెసిడెన్షియల్ బాలికల పాఠశాల, కొండపి సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలకు ఈ అవార్డులు దక్కాయి. వీటిలో విద్యార్థినులు పరీక్షల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించడంతోపాటు సగటు మార్కులు కూడా అధికంగానే ఉన్నాయి. అమ్మనబ్రోలు పాఠశాల హెచ్‌ఎం కె.మాధవి, కొండపి పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.అరుణ సీఎం చేతుల మీదుగా ఈ అవార్డులు అందుకోనున్నారు.

ఫేక్ మస్టర్లపై విచారణ

సంతమాగులూరు ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అడవిపాలెంలో ఉపాధి హామీ పనులలో జరిగిన ఫేక్ మస్టర్లపై డ్వామ ఏపీడీ కోటా నాయక్ విచారణ చేపట్టారు. మంగళవారం గ్రామంలోని సచివాలయంలో పనుల వివరాలను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దిండు హనుమంతరావు, డీసీ ఛైర్మన్ కామను శ్రీనివాసరావు, వెల్లల చెరువు సొసైటీ అధ్యక్షుడు బెల్లంకొండ ఏడుకొండలు, ఏపీవో బాలకృష్ణ నాయక్, గ్రామ పంచాయతీ కార్యదర్శి రమేష్ నాయక్ పాల్గొన్నారు.అనంతరం ఎటువంటి అవకతవకలు జరగలేదని ఫీల్డ్ అసిస్టెంట్ రాజా ఏపీడీకి వినతి పత్రం అందజేశారు.

అన్నదాతల సంబరాలు

సీఎంకు కృతజ్ఞతలు తెలుపుతూ జిల్లాలో ర్యాలీలు

ప్రత్యేక ఆకర్షణగా ట్రాక్టర్లు, ఎడ్లబండ్లు

భారీగా పాల్గొంటున్న రైతులు, టీడీపీ శ్రేణులు

ఇప్పటికే మూడు నియోజకవర్గాల్లో పూర్తి



కనిగిరిలో ట్రాక్టర్లతో ర్యాలీనిర్వహిస్తున్న రైతులు

రైతులకు సాగులో ఆర్థిక తోడ్పాటు కోసం అన్నదాత సుఖీభవ నగదు జమ చేయడంతో రైతులు, తెలుగు తమ్ముళ్లు సంబరాలు చేసుకుంటున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలియజేస్తూ జిల్లావ్యాప్తంగా భారీ ర్యాలీలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే కొండపి నియోజకవర్గంలో ఈ కార్యక్రమాన్ని అట్టహాసంగా చేశారు. మంగళవారం కనిగిరి, గిద్దలూరు నియోజకవర్గాల్లో చేపట్టిన ర్యాలీలు కోలాహలంగా సాగాయి. పెద్దఎత్తున రైతులు ట్రాక్టర్‌లతో తరలి వచ్చి పాల్గొన్నారు. బుధవారం సంతనూతలపాడుకు సంబంధించిన కార్యక్రమం పల్లామల్లిలో ఏర్పాటు చేశారు. మిగిలిన చోట్ల కూడా ర్యాలీల నిర్వహణకు సన్నాహాలు చేస్తున్నారు.

ఒంగోలు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా రైతుల కోసం కూటమి పార్టీల తరఫున టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు అన్నదాత సుఖీభవ పథకాన్ని ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వం ఏడాదికి రూ.6వేలను మూడు విడతలుగా పీఎం కిసాన్ పథకం కింద ఇస్తుండగా.. గత వైసీపీ ప్రభుత్వం దానికి రూ.7500 కలిపి రూ.13,500 రైతు భరోసా పేరుతో ఇచ్చింది. కాగా అన్నదాత సుఖీభవ పథకం పేరుతో కేంద్ర ప్రభుత్వంతో అనుసంధానం చేసి వారిచ్చే రూ.6వేలకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ.14వేలు కలిపి ఏకంగా రూ.20వేల నగదును అందజేయాలని ప్రజాప్రభుత్వం నిర్ణయించి అమల్లోకి తెచ్చింది. తొలివిడత రాష్ట్రంలో సుమారు 47 లక్షల మంది రైతులకు ఒక్కొక్కరికి కేంద్రం వాటా రూ.2వేలు, రాష్ట్రం వాటా రూ. 5వేలు కలిపి రూ.7వేల నగదు అందజేశారు. జిల్లాలోని దర్శి నియోజకవర్గం తూర్పువీరాయపాలెం గ్రామం నుంచే ఈ పథకానికి ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు శ్రీకారం చుట్టారు. జిల్లాలో అన్నదాత సుఖీభవ కింద సుమారు 2.68 లక్షల మంది రైతు కుటుంబాలకు తొలివిడత రూ.186కోట్లు అందాయి. ఈ మొత్తం వారి బ్యాంకు ఖాతాల్లో జమయ్యాయి. దర్శి నియోజకవర్గంలో అత్యధికంగా 42,971 మందికి రూ.29.07 కోట్లు అందాయి. కొండపి, కనిగిరి, ఎర్రగొండపాలెం నియోజకవర్గాలకు రూ. 25 కోట్ల నుంచి రూ.29 కోట్ల వరకు, ఇతర నియోజకవర్గాలకు తగుస్థాయిలో ఆర్థిక సహాయం అందింది. సాగువేళ అంత పెద్దమొత్తంలో అందిన నగదు రైతులకు ఉపకరించనుంది. ఈనేపథ్యంలో అన్నదాత సుఖీభవ పేరుతో తమకు ఆర్థిక సహకారం అందించిన సీఎం సుఖంగా ఉండాలని కోరుకుంటూ రైతులు, టీడీపీ శ్రేణులు కృతజ్ఞత ర్యాలీలు నిర్వహిస్తున్నారు.

కనిగిరి, గిద్దలూరులో కోలాహలంగా ర్యాలీలు

రెండు రోజుల క్రితం మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి ప్రాతినిధ్యం వహిస్తున్న కొండపి నియోజకవర్గంలోని జరుగుమల్లి మండలం కామేపల్లి నుంచి చిర్రికూరపాడు వరకు ర్యాలీ నిర్వహించారు. మంత్రి డాక్టర్ స్వామి, మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య పాల్గొన్నారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి వందలాదిగా రైతులు, టీడీపీ శ్రేణులు పెద్దసంఖ్యలో ట్రాక్టర్లతో పాల్గొన్నారు. మంగళవారం కనిగిరిలో అక్కడి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, గిద్దలూరులో స్థానిక ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి నేతృత్వంలో భారీ ర్యాలీలు జరిగాయి. పెద్దసంఖ్యలో రైతులు, టీడీపీ శ్రేణులు ట్రాక్టర్లతో తరలివచ్చారు. కోలాహలంగా కార్యక్రమం జరిగింది. అలాగే ఇతర నియోజకవర్గాల్లోనూ ర్యాలీల నిర్వహణకు స్థానిక టీడీపీ నేతలు సన్నాహాలు చేస్తున్నారు.

నేడు పల్లామల్లిలో నిర్వహణ

సంతనూతలపాడు నియోజకవర్గ ర్యాలీ బుధవారం సాయంత్రం చీమకుర్తి మండలం పల్లామల్లిలో నిర్వహించనున్నారు. చీమకుర్తితోపాటు మద్దిపాడు, ఎన్‌జీపాడు మండలాలకు కూడలిగా ఆ గ్రామం ఉండటంతో అక్కడ ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ పాల్గొననున్నారు. అలాగే మార్కాపురం, దర్శి, ఎర్రగొండపాలెం నియోజకవర్గాల ర్యాలీలను ఈనెల 14న నిర్వహించేందుకు అక్కడి టీడీపీ ప్రజాప్రతినిధులు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు సన్నాహాలు చేస్తున్నారు.

కురిసింది వాన..



ఒంగోలులోని ఆర్టీసీ డిపో ఎదురు కర్నూలురోడ్డులో వర్షపు నీరు

తూర్పున భారీ వర్షం

ఒంగోలు జలమయం

చెరువులను తలపించిన రోడ్లు

జిల్లా అంతటా చల్లబడిన వాతావరణం

ఒంగోలు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని తూర్పుప్రాంతంలో మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఒంగోలు, కొత్తపట్నం, మద్ది పాడు, ఎన్‌జీపాడు, సంతనూతలపాడు తదితర మండలాల్లో దాదాపు రెండు గంటలపాటు తెరపి లేకుండా పడింది. ఒంగోలు నగరం జలమయమైంది. రోడ్లు చెరువులను తలపించాయి. దాదాపు నెలన్నర రోజులుగా జిల్లాలో సరైన వర్షం లేక పూర్తి బెట్టవాతావరణం, వేసవిని తలపించేలా ఎండలు కాచాయి. రెండు రోజుల నుంచి వాతావరణంలో మార్పు వచ్చింది. ఉష్ణోగ్రతలు తగ్గి వాతావరణం చల్లబడటంతోపాటు అక్కడక్కడా జల్లులు కూడా పడ్డాయి. గత రాత్రి పశ్చిమ ప్రాంతంలోని కొన్ని మండలాల్లో ఒక మోస్తరు వర్షం కురిసింది. మంళవారం సాయంత్రం తూర్పుప్రాంతంలో భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం మూడు గంటల నుంచే ఈ ప్రాంతంలో వాతావరణంలో మార్పు వచ్చింది. సాయంత్రం నాలుగు గంటల నుంచి జల్లులు ప్రారంభమయ్యాయి. నాలుగున్నర నుంచి ఆరున్నర వరకు ఒంగోలు నగరంతోపాటు పరిసర ప్రాంత మండలాల్లో భారీ వర్షం కురిసింది. ఈ సమయంలో మద్దిపాడులో ఏకంగా 90 మి.మీ వర్షపాతం నమోదైంది. అక్కడ ప్రధాన వీధులపై వర్షపు నీరు పారుతూ జనం అవస్థ పడ్డారు. అలాగే కొత్తపట్నంలో 69.75మి.మీ, ఒంగోలులో 48.25, ఎన్‌జీపాడు మండలం వినోదరాయునిపాలెంలో 42.50, సంతనూతలపాడులో 25.75 మి.మీ కురిసింది. దర్శి, కురిచేడు, చీమకుర్తి, సింగరాయకొండ, పొదిలి, టంగుటూరు, జరుగుమల్లి తదితర ప్రాంతాల్లో జల్లులు పడ్డాయి. సాయంత్రం వేళ అది కూడా దాదాపు రెండు, మూడు గంటలపాటు తెరపిలేకుండా వర్షం కురవడంతో ఒంగోలు నగర ప్రజానీకం తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. భారీ వర్షంతో నీరంతా రోడ్లపైకి వచ్చి చెరువులు, కాలువలను తలపించే రీతిలో పారడంతో ప్రధాన రోడ్లలో వాహనాలపై వెళ్ళేవారు అవస్థలు పడాల్సి వచ్చింది. చిరు వ్యాపారులు,వీధి వ్యాపారులతో పాటు సాయంత్రం పనులు ముగించుకొని ఇళ్ళకు వెళ్ళే ఉద్యోగులు, కాలేజీ విద్యార్థులు ఇతరత్రా కూడా వర్షంతో ఇక్కట్లు పడ్డారు. ఇదిలా ఉండగా ఒక వైపు రుతుపవనాల ప్రభావం మరో వైపు బంగాళాఖాతంలోఅల్పపీడన ప్రభావంతో వాతావరణంలో ఈమార్పు కపిస్తుండగా మరో మూడు నాలుగు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ సమాచారాన్ని బట్టి తెలుస్తున్నది.

ఒడా ఛైర్మన్‌గా రియాజ్

జనసేనకు దక్కిన కీలక పదవి

తొలుత లైవ్ స్టాక్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పదవి

కోర్టు సమస్య ఎదురవడంతో మార్పు

ఒంగోలు ఎమ్మెల్యే జనార్దన్ కీలకపాత్ర



రియాజ్

ఒంగోలు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లాస్థాయిలో కీలకమైన ఒంగోలు పట్టణాభివృద్ధి సంస్థ (ఒడా) ఛైర్మన్ పదవి జనసేనకు దక్కింది. ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్‌ను ఆ సంస్థకు ఛైర్మన్‌గా నియమించారు. ఈ విషయంలో తొలుత టీడీపీ అధిష్ఠానం విముఖత వ్యక్తంచేసినా తనకు ఎన్నికల్లో సంపూర్ణ సహకారం అందించినందుకు రియాజ్‌కే ఆ పదవి ఇవ్వాలని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పట్టుపట్టడం కూడా రియాజ్‌కు కలిసి వచ్చింది. జనసేన అధినేత పవన్ కల్యాణ్ పార్టీ ప్రారంభించినప్పటి నుంచి జిల్లాలో రియాజ్ ఆయన వెన్నంటి ఉన్నారు. ఆ పార్టీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్న ఆయన 2019 ఎన్నికల్లో జనసేన తరఫున ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓడిపోయారు. ఒంగోలు నగరానికి చెందిన రియాజ్ గత వైసీపీ ప్రభుత్వంలో అరాచకాలకు వ్యతిరేకంగా పలు కార్యక్రమాలు నిర్వహించారు. గత ఎన్నికలకు ముందు రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీలు కూటమిగా ఏర్పడిన అనంతరం జిల్లాలో టీడీపీ నాయకులతో రియాజ్ సమన్వయంతో ముందుకు సాగారు. ప్రత్యేకంగా కీలక నేత అయిన ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌తో అత్యంత సన్నిహితంగా మెలిగారు. ఎన్నికల్లో ఆయన గెలుపునకు కృషి చేశారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం నామినేటెడ్ పదవుల జాబితాలో జనసేన నుంచి రియాజ్ పేరు రాష్ట్రస్థాయి పదవికి ముందు వరుసలో ఉంది. అలాగే ఎన్నికల్లో తనకు సంపూర్ణ సహకారం అందించిన ఆయనకు ఒడా ఛైర్మన్ పదవి ఇప్పించాలని ఎమ్మెల్యే జనార్దన్ ప్రయత్నాలు ప్రారంభించారు. టీడీపీ జిల్లా సమన్వయ కమిటీ సమావేశంలో ఆ ప్రతిపాదన కూడా ఇతర నాయకుల ముందు జనార్దన్ ఉంచారు. ఒడా ఛైర్మన్ వంటి కీలక పదవి టీడీపీకి చెందిన వారికే ఇవ్వాలన్న భావనలో అధిష్ఠానంలో ఉండటంతో రియాజ్ పేరు రేసు నుంచి పక్కకు తొలగి టీడీపీకి చెందిన దర్శి మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు పేరు ప్రముఖంగా ముందుకు వచ్చింది. దానికి అనుగుణంగానే రాష్ట్ర లైవ్ స్టాక్ అభివృద్ధి సంస్థ ఛైర్మన్‌గా రియాజ్‌ను గతంలోనే నియమించారు. అయితే ఆ సంస్థకు గత వైసీపీ ప్రభుత్వంలో నియమితులైన కమిటీ సభ్యులు కోర్టును ఆశ్రయించడంతో రియాజ్ ఆబాధ్యతలు చేపట్టలేకపోయారు. ఈక్రమంలో ఒకవైపు తన పార్టీ (జనసేన) నేతల ద్వారా రియాజ్, మరోవైపు తాను తొలుత చేసిన ప్రతిపాదనకు అనుగుణంగా ఎమ్మెల్యే జనార్దన్ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. చివరకు ఒడా ఛైర్మన్ పదవి రియాజ్‌కే దక్కింది.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై సమరం

(5వ పేజీ తరువాయి)

ప్రారంభించి ప్రసంగించారు. భవిష్యత్తుతరాలకు పర్యావరణాన్ని రక్షించడానికి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిర్మూలించడానికి ప్రజల్లో అవగాహన కల్పించడంలో యువత కీలకపాత్ర పోషించాలన్నారు. ప్లాస్టిక్‌ను నిర్మూలించడం పరిశుభ్రతకు సంబంధించిన విషయమే కాదని, బాధ్యతాయుతమైన సంస్కృతిని సృష్టించే అంశమన్నారు. పరిశుభ్రత, పచ్చదనంతో పర్యావరణ హిత సింగిల్ యూజ్‌డ్ ప్లాస్టిక్ రహిత రాజధానిగా అమరావతిని తీర్చిదిద్దేందుకు రెడ్‌క్రాస్ సొసైటీ లక్ష్యంగా ఏర్పాటు చేసుకున్నట్లు చెప్పారు.

పైలెట్ ప్రాజెక్టుగా గుంటూరు..

యూత్, జూనియర్ రెడ్‌క్రాస్‌ల ఆధ్వర్యంలో దేశంలోనే మొట్టమొదటి సారి ప్లాస్టిక్ నివారణ ఉద్యమం గుంటూరులో ప్రారంభించడం సంతోషంగా ఉన్నదని తెలిపారు. రెడ్‌క్రాస్ రాష్ట్ర కోశాధికారి రామచంద్రరాజు నాయకత్వంలో పైలట్ ప్రాజెక్టుగా గుంటూరును ఎన్నుకున్నట్లు గవర్నర్ తెలిపారు. సాంస్కృతికంగా, విద్యాపరంగా ప్రత్యేకమైన స్థానం ఉన్న గుంటూరు నాయకత్వానికి ప్రసిద్ధి చెందినదని చెప్పారు. అందుకే ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సంస్థ సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై యద్ధాన్ని ఇక్కడి నుంచే ప్రారంభిస్తున్నదని చెప్పారు. ఇక్కడ విజయవంతమైతే కచ్చితంగా అది రాష్ట్రమంతటా విస్తరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గుంటూరు నగరంలో 50 వేల మంది జూనియర్ రెడ్ క్రాస్ విద్యార్థుల ద్వారా వారి కుటుంబ సభ్యులను ప్రేరేపించి, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నివారణకు రెడ్‌క్రాస్ కృషి చేస్తుందని తెలిపారు.

విద్యార్థులకు అభినందనలు..

ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఎస్తేరు రాణి, లౌఖ్యలను గవర్నర్ నజీర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ ఇద్దరు విద్యార్థినులు సోషల్ సర్వీసు కింద ప్రతీ మూడో శనివారం ప్రజల వద్దకు వెళ్లి సింగిల్ యూజ్ ప్లాసిక్ వల్ల కలిగే అనర్థాలు, ఏపీ వాతావరణ కార్యచరణ గురించి వివరించి రెడ్‌క్రాస్ యాప్‌లో అప్‌లోడింగ్ చేస్తారు. వీరు చేస్తోన్న సర్వీసుని గవర్నర్ ప్రశంసించారు. తొలుత రెడ్ క్రాస్ వ్యవస్థాపకుడు హెన్రీడ్యునాంట్ చిత్రపటానికి గవర్నర్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏకే ఫరీదా, గవర్నర్ ఎక్స్ ఆఫిషియో సెక్రటరి డాక్టర్ ఎం హరిజవహర్‌లాల్, రెడ్ క్రాస్ ఏపీ రాష్ట్ర శాఖ ఛైర్మన్ వైడీ రామారావు, కోశాధికారి పీ రామచంద్రరాజు, గుంటూరు జిల్లా బ్రాంచ్ ఛైర్మన్ వడ్లమాని రవి తదితరులు పాల్గొన్నారు. గవర్నర్‌కు కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ సతీష్‌కుమార్, ఎమ్మెల్యేలు బూర్ల రామాంజనేయులు, మహమ్మద్ నసీర్ అహ్మద్, గళ్లా మాదవి, నగరపాలక సంస్థ కమిషనరు పులి శ్రీనివాసులు పుష్పగుచ్చాలు అందించి స్వాగతం పలికారు.

డీఎస్సీ నియామకాలకు రంగం సిద్ధం

అవీఇవీ

స్కోర్ కార్డుల రూపంలో అభ్యర్థుల మార్కుల వివరాలు

అభ్యంతరాలు తెలిపేందుకు నేడు తుది గడువు

ఒంగోలు విద్య, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మెగా డీఎస్సీ-2025 నియామకాలకు రంగం సిద్ధమైంది. మెగా డీఎస్సీ ఫలితాలను, అభ్యర్థులు సాధించిన మార్కుల వివరాలను స్కోర్ కార్డుల రూపంలో పాఠశాల విద్యాశాఖ సోమవారం రాత్రి విడుదల చేసింది. వీటిని అభ్యర్థులు డీఎస్సీ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. జిల్లాలో డీఎస్సీకి 629 పోస్టులు ప్రకటించగా 21,559 మంది దరఖాస్తులు చేశారు. వీరికి జూన్ 6నుంచి జూలై 2 వరకు 26 రోజులపాటు కంప్యూటర్ ఆధారిత పరీక్షలు రెండు సెషన్లలో నిర్వహించారు. పరీక్షకు హాజరైన అందరి అభ్యర్థుల తుది మార్కులను ప్రస్తుతం విడుదల చేశారు. వీటిపై అభ్యంతరాలు తెలియజేసేందుకు బుధవారం వరకు గడువు ఇచ్చారు. అలా వచ్చిన వాటిని పరిశీలించి తుది మెరిట్ జాబితాను ప్రకటించనున్నారు. అనంతరం మెరిట్ కమ్ రోస్టర్ విధానంలో టీచర్ పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేస్తారు. జిల్లాలో డీఎస్సీ పోస్టుల భర్తీకి సంబంధించి అన్ని ముందస్తు ఏర్పాట్లు చేయాలని పాఠశాల విద్య డైరెక్టర్ విజయరామరాజు ఆదేశించారు. అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలనకు ప్రతి 50 మందికి ఒక బృందాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఆ ప్రకారం జిల్లాలో 629 మందికి 13 బృందాలను నియమిస్తారు. ప్రతి టీంలో ఒక ఎంఈవో, ఒక హెచ్‌ఎం, ఒక డిప్యూటీ తహసీల్దార్ (రెవెన్యూ)ను నియమించనున్నారు. ఒక పోస్టుకు ఒక ఖాళీని మాత్రమే చూపించనున్నారు.

పులి దాడిలో గేదె మృతి

భయాందోళనలో అటవీసమీప గ్రామాల ప్రజలు



పెద్దపులి దాడిలో మృతిచెందిన గేదె

గిద్దలూరు టౌన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : వెల్లుపల్లె అటవీ ప్రాంతంలో పెద్ద పులి సంచరిస్తుండడంతో ఆ చుట్టు పక్క గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రెండు రోజుల కిందట జయరాంపురం గ్రామానికి చెందిన మోడి రంగస్వామికి చెందిన గేదె మేతకు వెళ్లగా పెద్దపులి దాడి చేయడంతో మృతిచెందింది. గేదె కనిపించక పోవడంతో రంగస్వామి గాలిస్తుండగా వెల్లుపల్లె అటవీ ప్రాంత సమీపంలో మృతిచెంది ఉన్నది. ఆనవాళ్లను గుర్తించిన రైతులు గ్రామస్థుల సహకారంతో అటవీశాఖ అధికారులకు తెలియచేయడంతో అధికారులు ఆప్రాంతాన్ని పరిశీలించి పెద్దపులి సంచరిస్తున్నట్లు తెలిపారు. మృతిచెందిన గేదె విలువ రూ.80వేలు అని రంగస్వామి తెలిపాడు. పెద్దపులి సంచారంతో వెల్లుపల్లె, జయరాంపురం, జయరాంపురం తాండా గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

జిల్లా మంత్రితోనే జెండా ఆవిష్కరణ

ప్రభుత్వం ఉత్తర్వులు

ఒంగోలు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈనెల 15వ తేదీన ఒంగోలులోని పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించే వేడుకల్లో జాతీయ జెండాను జిల్లాకు చెందిన మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి ఆవిష్కరించనున్నారు. ఆ మేరకు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చాయి. మంత్రులు సొంత జిల్లాల్లో ఆగస్టు 15న జెండా ఆవిష్కరణలు చేయడం అరుదుగా జరుగుతుంది. గతంలో ఏప్రభుత్వం అధికారంలో ఉన్నా ఇన్‌చార్జి మంత్రి జెండాను ఆవిష్కరిస్తుంటారు. అయితే ప్రస్తుత ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలి ఏడాది (గత ఏడాది) స్వాతంత్ర్య వేడుకల నాటికి ఇన్‌చార్జి మంత్రుల నియామక ప్రక్రియ పూర్తి కాలేదు. దీంతో జిల్లాకు చెందిన మంత్రులే జెండా ఆవిష్కరణలు చేశారు. ఈ ఏడాది కూడా అదేవిధానాన్ని అనుసరించనున్నారు. ఈమేరకు ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. ఆ ప్రకారం ఈనెల 15న ఒంగోలులోని పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో జరిగే కార్యక్రమంలో డాక్టర్ స్వామి జాతీయ జెండాను ఎగురవేయనున్నారు.

అమరుల త్యాగం అజరామరం

(5వ పేజీ తరువాయి)

గాలి రామకోటయ్య, ప్రయాగ రాఘవయ్య, జాస్తి అప్పయ్యల స్థూపాల వద్ద పూలు సమర్పించి నివాళులర్పించారు. ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్ క్యాడెట్ల గౌరవ వందనం చేయించారు. అనంతరం జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ, స్వాతంత్ర్య పోరాటంలో తెనాలిలో జరిగిన సంఘటన దేశం మొత్తం ఉలికిపాటుకు గురి చేసిందని, ప్రతి ఒక్కరిలో స్ఫూర్తి రగిలించిందన్నారు. సమరయోధులు మనపై పెట్టిన గురుతర బాధ్యతను నెరవేర్చాలన్నారు. కోట్లాది మంది పోరాటం, పోరాట పటిమ, త్యాగ నిరతితో దేశానికి సిద్ధించిన స్వాతంత్ర్యాన్ని కుల, మత బేధాలు విడిచి కాపాడుకోవాలన్నారు. మహిళా కమిషన్ మాజీ ఛైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి మాట్లాడుతూ కులమతాల అడ్డుగోడలు నిర్మించుకుని ఎందరో త్యాగాలతో వచ్చిన స్వాతంత్ర్యానికి విలువ లేకుండా చేయవద్దని కోరారు. సమాజ సేవ చేస్తున్న పలువురు పట్టణ ప్రముఖులను ఘనంగా సన్మానించారు. సబ్ కలెక్టర్ సంజన సింహా, మున్సిపల్ ఛైర్‌పర్సన్ రాధిక, కమిషనర్ లక్ష్మీపతిరావు, తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ, డీఎస్పీ జనార్ధనరావు, లెఫ్టినెంట్ కల్నల్ ఉదయ్‌కుమార్, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

మాఫియా మంత్రగాడు..

(5వ పేజీ తరువాయి)

చూసీచూడనట్లు వదిలేయడం అధికార యంత్రాంగం పని. ఏదైనా సమస్య వస్తే వాటిని పరిష్కరించడం ప్రజాప్రతినిధుల పని. పాతగుంటూరు, ప్రత్తిపాడు, సత్తెనపల్లిలో మిల్లులు నడుపుతున్న ఓ మిల్లర్, గుంటూరు ఆర్టీసీ కాలనీలోని మరో మిల్లర్ ఈ వ్యవహారం మొత్తంలో అత్యంత కీలకంగా ఉన్నాడు.

ఆధిపత్య పోరులోనూ చక్రం..


ఇటీవల రేషన్ మాఫియాలో ఆధిపత్య పోరు నెలకొంది. ఎప్పటినుంచో మాఫియాపై పట్టున్న డాన్‌పై కొంతమంది తిరుగుబాటు చేసి సొంత ముఠా పెట్టుకున్నారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గం కేంద్రంగా బియ్యాన్ని సేకరించారు. దీంతో మంత్రగాడు ఆ ముఠాపై కన్నెర్ర చేశాడు. ఐదారు నెలలుగా బియ్యాన్ని సేకరించిన కొత్త ముఠా బియ్యాన్ని సొమ్ము చేసేవారు లేక అల్లాడిపోయారు. చివరకు వారే తరలించేందుకు సిద్ధమవగా అధికారులకు, పోలీసులకు సమాచారం ఇచ్చి వారిని పట్టించారు. ఇలా గడిచిన ఐదారు నెలల్లో కొత్తగా పుట్టుకొచ్చిన మరో మాఫియా డాన్ నేత రూ.70 లక్షల మేర నష్టపోయి చేతులెత్తేశాడు. తాజాగా గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో మరొకరు ముందుకొచ్చారు. ఈ వారంలోనే అతడి వాహనాలు అధికారుల చేతిలో పడ్డాయి. దీంతో అతడి పని కూడా అయిపోయింది. ఇలా ఈ మాఫియా డాన్ తిరుగులేని ఆధిపత్యాన్ని చెలాయిస్తున్నాడు.

ఎరువుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలి

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వ్యవసాయ సీజన్‌కు సంబంధించి ఎరువుల కొరత లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి మంగళవారం సాయంత్రం రెవెన్యూ డివిజనల్ అధికారులు, తహసీల్దార్లు, సంబంధిత అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. రైతులు ఇబ్బందులు పడకుండా సకాలంలో ఎరువులు అందించేందుకు సమన్వయంతో పనిచేయాలన్నారు. కౌలు రైతులకు సీసీఆర్సీ కార్డులు మంజూరు చేయాలని, నిర్దేశించిన గడువు లోపు ఈ-క్రాప్ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. పీజీఆర్‌ఎస్‌లో రెవెన్యూ అంశాలపై వచ్చిన దరఖాస్తులు పెండింగ్‌తో పాటు ఇంటి పట్టాల రీ వెరిఫికేషన్ ప్రక్రియ, రీసర్వేతో పాటు కౌలు రైతులకు పంట సాగుదారు హక్కుల కార్డులు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈనెల 15వ తేదీ నుంచి రాజముద్రతో వచ్చిన పట్టాదారుపాసుపుస్తకాల పంపిణీపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జేసీ ఆదేశించారు. ఎస్‌డీసీ వరకుమార్, అధికారులు శ్రీనివాసరావు, పద్మశ్రీ, గౌస్‌బాషా పాల్గొన్నారు.

14న శింగరకొండలో విమాన కలశ పునః ప్రతిష్ఠ

ప్రారంభమైన ప్రత్యేక పూజలు



అద్దంకి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం విమాన కలశ పునఃప్రతిష్ఠ ఈ నెల 14వ తేదీ ఉదయం 11-45 గంటలకు జరుగుతుందని చైర్మన్ గుంజి శ్రీనివాసరావు, ఈవో మద్దినేని శ్రీనివాసరావు తెలిపారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. సాయంత్రం అంకురార్పణ పూజలు నిర్వహించారు. బుధవారం విమాన కలశానికి వాస్తు శుద్ధి, అధివాసాలు, హోమాలు, మహాశాంతిహోమం కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. గురువారం కలశ పునఃప్రతిష్ఠ అనంతరం పూర్ణాహుతి జరుగుతుందని వివరించారు. కలశ పునః ప్రతిష్ఠ అద్దంకికి చెందిన కోనేటి అనిల్ సహకారంతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నేడు ప్రసన్నాంజనేయ స్వామి హుండీల లెక్కింపు

అద్దంకి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి) : శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం హుండీల కానుకల లెక్కింపు బుధవారం జరుగుతుందని ఈవో, అసిస్టెంట్ కమిషనర్ తిమ్మానాయుడు తెలిపారు. అడిగొప్పుల దేవస్థానం ఈవో ఆదిశేషనాయుడు పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

శివాలయంలో అన్నదానం

దేవాంగపురి/చీరాల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : చీరాల మండల పరిధిలోని దేవాంగపురి శివాలయంలో బట్టా మోహన్‌రావు, పుష్పవల్లి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సుమారు 100 మందికి అన్నదానం జరిగింది. వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పోలుదాసు రామకృష్ణ, మహాలక్ష్మీ దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు.

అరకొర బస్సులతో ప్రయాణమెట్టా?

పల్లెలకు నడవని పల్లె వెలుగులు

ఈ నెల 15 నుంచి స్త్రీశక్తి పథకం అమలు

గ్రామీణ మహిళలకు ఆటోల ప్రయాణమే దిక్కా!



అద్దంకి ఆర్టీసీ బస్టాండ్

అద్దంకి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : ప్రజా ప్రభుత్వం ఎన్నికల హామీల అమలులో భాగంగా మహిళలకు ఆర్టీసీ బస్‌లలో ఉచిత ప్రయాణాన్ని ఈ నెల 15వ తేదీ నుంచి అమలు చే యనుంది. ఆ మేరకు ఇప్పటికే జీవో జారీ చేసింది. అందుకు తగ్గట్లు అద్దంకి డిపోలో ఎలాంటి అదనపు బస్సులు కేటాయించలేదు. ఉన్న అరకొర బస్సులతో నెట్టుకురావాల్సిన పరిస్థితి.

ఉన్న బస్‌లు 69

ప్రస్తుతం అద్దంకి డిపోలో మొత్తం 69 బస్సులు ఉండగా అందులో 4 సూపర్ లగ్జరీ బస్సులు కాగా మిగిలినవి పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులు ఉన్నాయి. పల్లెవెలుగు బస్సులలో అత్యధిక శాతం ప్రధాన రూట్లు అయిన నర్సరావుపేట, ఒంగోలు, వినుకొండ, పొదిలి రూట్లలోనే తిరుగుతున్నాయి. గ్రామాలకు నడిచే పల్లె వెలుగు బస్సులు పట్టుమని 10 కూడా లేవు. కొన్ని బస్సులను మాత్ర ం ఆయా గ్రామాల నుంచి విద్యార్థులు పాఠశాలలు, కళాశాలకు వచ్చే విధంగా ఉదయం, సాయంత్రం సమయాలలో మాత్రమే నడుపుతున్నారు. కొన్ని బస్సులు అయితే ఉదయం పూట మాత్రమే నడుపుతున్నారు. సాయంత్రం ఆయా గ్రామాలకు వెళ్లాలంటే ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించక తప్పని పరిస్థితి.

కొన్ని గ్రామాలకు రాని పల్లె వెలుగు బస్‌లు

అద్దంకి నుంచి వైదన, బల్లికురవ మీదుగా చిలకలూరిపేట బస్సు, అద్దంకి నుంచి తాళ్లూరు, గంగవరం మీదుగా బొద్దికూరపాడు నడిపే బస్సులు ఉదయం సమయంలో మాత్రమే నడుపుతున్నారు. అద్దంకి నియోజకవర్గంలో సుమారు 30కు పైగా గ్రామాలకు అసలు ఆర్టీసీ బస్ సౌకర్యమే లేదు.

అద్దంకి మండలంలోని ప్రధాన గ్రామాలైన ధేనువకొండ, బొమ్మనంపాడు, చినకొత్తపల్లి, మణికేశ్వరం, నాగులపాడు, వెంకటాపురం తదితర గ్రామాలకు ఆర్టీసీ బస్సులు నడపటం లేదు. దీంతో అత్యధిక గ్రామాల నుంచి ప్రజలు ఆటోలలోనే ప్రయాణిస్తున్నారు. ఇలా మొక్కుబడిగా బస్సులు నడిపితే ఆయా గ్రామాల నుంచి మహిళలు ఎలా ప్రయాణం చేయాలని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి అవకాశం ఉన్న మేర అత్యధిక గ్రామాలకు బస్సులు నడిపే విధంగా చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల మహిళలు కోరుతున్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

పొదుపు సంఘాల మహిళలకు ఆర్థిక భరోసా

పెరటి కోళ్లు పంపిణీ



పెరటి కోళ్లను పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు, వెలుగు అధికారులు

చినగంజాం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : స్వయం సహాయక సంఘాల సభ్యులకు ప్రభుత్వం కల్పిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి చెందాలని టీడీపీ మండల అధ్యక్షుడు పొద వీరయ్య, చినగంజాం గ్రామ సర్పంచ్ రాయని ఆత్మారావులు చెప్పారు. స్థానిక వెలుగు కార్యాలయ ఆవరణలో వెలుగు విభాగం ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల సభ్యురాళ్లకు మంగళవారం జరిగిన పెరటి కోళ్లు పంపిణీ కార్యక్రమంలో ఏపీఎం గద్దె పెదసుబ్బారావు మాట్లాడుతూ ఒక యూనిట్ ఖరీదు ఐదు వేల రూపాయలకు 10 కోళ్లు ఇస్తామన్నారు. వీటిలో ఏడు పెట్టలు, మూడు పుంజులు, ఒక నెలకు సరిపోయేటు వంటి దాణా, మెడిసిన్, కోళ్ల బాక్స్ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కోళ్లు పొదగకుండానే సుమారు రెండు, మూడు నెలలు వరుసగా గుడ్లు పెడతాయని తెలిపారు. ప్రతి కుటుంబంలో ఉన్న సభ్యురాలు ప్రతి రోజు కోడిగుడ్డు తినాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. చినగంజాం మండలానికి 50 యూనిట్లు మంజూరయ్యాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యురాలు యార్లగడ్డ లక్ష్మీ, టీడీపీ నాయకులు చెరుకూరి రాఘవయ్య, నరహరి శ్రీనివాసరావు, పర్వతరెడ్డి పార్థసారిధి, వెలుగు సీసీలు కే.వెంకటస్వామి, మాధవి పాల్గొన్నారు.

వేటపాలెం/చీరాల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : పొదుపు సంఘాల్లోని మహిళలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రభుత్వం అన్ని విధాలా చర్యలు తీసుకుంటున్నట్లు వేటపాలెం ఎంపీడీవో రాజేష్‌బాబు చెప్పారు. మంగళవారం ఏపీఎం అంజిబాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పెరటి కోళ్లు పంపిణీ చేశారు. ఒక్కో యూనిట్ ధర రూ.5 వేలు ప్రకారం సభ్యులకు ప్రోత్సాహకం అందిస్తున్నట్లు చెప్పారు. వాటిపెంపకం ద్వారా ఆర్థికంగా బలపడి జీవన విధాలను మెరుగు పరచుకోవాలని సూచించారు. సీసీలు విజయలక్ష్మి, చిన్నయ్య, అనూరాధ పాల్గొన్నారు.

17న భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ప్రతిష్ఠా మహోత్సవం



నిర్మాణం పూర్తి చేసుకుంటున్న ఆలయం

పంగులూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : పంగులూరులో చిలుకూరి వంశ ఇలవేల్పు శ్రీభద్రకాళీ మాత దేవరగుడి సర్వాంగసుందరంగా రూపుదిద్దుకుంది. గ్రామానికి తూర్పు దిక్కున 16సెంట్ల సువిశాల స్థలంలో చిలుకూరి వంశస్తులు తమ ఇష్టదైవంగా కొలిచే శ్రీభద్రకాళీ సమేత వీరభద్ర స్వామి నూతన ఆలయం, దీనికి అనుబంధంగా భక్తుల సౌకర్యార్థం కోసం వసతులతో కూడిన విశ్రాంతి గదులు, భోజనశాల నిర్మాణం జరిగింది. కోటి రూపాయల వ్యయంతో చేపట్టిన ఈ నూతన ఆలయం, భోజనశాల, వసతిగదుల నిర్మాణానికి ప్రవాసాంధ్రులు పంగులూరు గ్రామానికి చెందిన కొణకంచిరాము 11సెంట్లు, గ్రామ నివాసి చిలుకూరి పెదబాబు ఐదు సెంట్ల స్థలాన్ని ఉచితంగా సమకూర్చారు. పంగులూరు, చినమల్లవరం, నక్కలపాలెం పరిసర ప్రాంతాలకు చెందిన వందలాదిమంది చిలుకూరి వంశస్తులు సమకూర్చిన భారీ విరాళాలతో ఈ ఆలయనిర్మాణం రూపుదిద్దుకుంది.

దేవతామూర్తుల ప్రతిష్ఠా మహోత్సవం

తరతరాలుగా చిలుకూరి వంశస్తుల ఇలవేల్పుగా ఆరాధించే శ్రీభద్రకాళీ సమేత వీరభద్రస్వామివారి ప్రతిష్ఠా మహోత్సవం 17వతేదీ ఉదయం 10.21 నిమిషాలకు జరగనుంది. 14వ తేదీ నుంచి పలు కార్యక్రమాలతో ఆలయ కమిటీ సభ్యులు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు

సమస్యల పరిష్కారం కోరుతూ అధ్యాపకుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న అధ్యాపకులు

అద్దంకిటౌన్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లోని అధ్యాపకుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద అధ్యాపకులు నల్లబ్యాడ్జీలు ధరించి భోజన విరామ సమయంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అధ్యాపకులు మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాపకుల బదిలీలు నిర్వహించాలని, గత ప్రభుత్వం ఎయిడెడ్ అధ్యాపకులను ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో నియమించిన జీవో నెం 42ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అర్హత కలిగిన అధ్యాపకులను దేశంలోని 26 రాష్ట్రాల్లో ఉన్న వివిధ అసిస్టెంట్ ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్‌లుగా రిజిగ్నేట్ చేయాలని డిమాండ్ చేశారు. అనేక సార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు తెలియజేసినా పట్టించుకోలేదని, ఇలానే కొనసాగితే ఈనెల 18వ తేదీన విజయవాడలో జరిగే రాష్ట్ర వ్యాప్త మహాధర్నా నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు వి. ప్రసాద్, సిహెచ్.సురేష్‌కుమార్, ఏ.అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులలో రక్తహీనత, బుద్ధిమాంద్యంను నివారించాలి



విద్యార్థులతో నులిపురుగుల మాత్రలు మింగిస్తున్న వైద్యాధికారి, ఉపాధ్యాయులు

అద్దంకిటౌన్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి) : ఆల్ బెండజోల్ మాత్రతో నులిపురుగులను నివారించి, తద్వారా విద్యార్థులలో రక్తహీనత, బుద్ధిమాంద్యం నివారించవచ్చుని మోదేపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీహర్ష చెప్పారు. మంగళవారం జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా మోదేపల్లి పీహెచ్‌సీ పరిధిలోని అన్ని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులకు, పని చేసే సిబ్బందికి మధ్యాహ్నం భోజనం అనంతరం నులిపురుగుల నివారణ కొరకు ఆల్ బెండజోల్ మాత్రలను మింగించారు. కొటికలపూడి యూపీ స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ శ్రీహర్ష నులిపురుగుల వలన కలిగే ఆరోగ్య సమస్యలు, నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. మొత్తం 4,833 మందికిగాను 4,654 మందికి మాత్రలు మింగించారు. అద్దంకిలోని కాకానిపాలెం, గాజులపాలెం యూపీహెచ్‌సీ పరిధిలోని అన్ని పాఠశాలలు, అంగన్‌వాడీ, జూనియర్ కళాశాలలోని విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బందితో వైద్యాధికారులు డాక్టర్ హేమ మాధిరి, డాక్టర్ గొట్టిపాటి జయసింహల ఆధ్వర్యంలో నులిపురుగుల నివారణ మాత్రలను మింగించారు. కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్ ఎం.వి సత్యనారాయణ అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు.

పంగులూరులో...

పంగులూరు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి) : పంగులూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల చేత పీహెచ్‌సీ డాక్టర్ శివ చెన్నయ్య నులిపురుగుల మాత్రలు మింగించారు. హెచ్ఎం సోమేపల్లి హనుమంతరావు, తహసీల్దార్ సింగారావు పాల్గొన్నారు.

చినగంజాంలో...

చినగంజాం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి) : మండలంలోని సంతరావూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని సంతరావూరు, గొనసపూడి, కడవకుదురు, మోటుపల్లి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలోని 1787 మంది విద్యార్థులకు వైద్యాధికారులు కే కీర్తిసరోజ్, బీనాగేంద్రలు నులిపురుగుల నివారణ మాత్రలు మింగించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కె.సత్యానందం, పీహెచ్‌సీ హెచ్ఈవో యు.వెంకటరమణ పాల్గొన్నారు.

మార్టూరులో...

మార్టూరు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోలలపూడి గ్రామంలో జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు నులిపురుగుల మాత్రలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సతీష్‌కుమార్, ప్రధానోపాధ్యాయులు రవి, వైద్య సిబ్బంది మౌనిక, భవాని, ఆశా సిబ్బంది గాయత్రి, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

పర్చూరులో...

పర్చూరు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి) : కారంచేడు గ్రామంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లోని విద్యార్థులకు కమ్యూనిటీ హెల్త్ అధికారిణి శాంతిప్రియ నులి పురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎం జ్యోత్స్న పాల్గొన్నారు.

అవీఇవీ

రైతు సమస్యల పరిష్కారంలో పారదర్శకత పాటించండి : ఎమ్మెల్యే కొండయ్య



ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందిస్తున్న చైర్మన్ శ్రీనివాసరావు

చీరాల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : రైతు సమస్యల పరిష్కారంలో సహకార సంఘాలు పారదర్శకంగా పని చేయాలని ఎమ్మెల్యే కొండయ్య చెప్పారు. ఇటీవల వేటపాలెం మండలం సహకార సంఘం చైర్మన్‌గా మండల టీడీపీ సీనియర్ నాయకులు పల్లప్రోలు శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కొండయ్యను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ అధికార ప్రతినిధి మహేంద్రనాథ్, యువనాయకులు గౌరీ అమర్నాథ్ పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యంపై కఠిన చర్యలు

పట్టణంలో విస్తృతంగా అధికారులు తనిఖీలు



వివరాలు వెల్లడిస్తున్న విద్యుత్ అధికారులు

చీరాల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ చౌర్యంపై కఠిన చర్యలు తప్పవని అధికారులు చెప్పారు. మంగళవారం చీరాల పట్టణంలోని డీ 1 సెక్షన్ పరిధిలో 34 బృందాలుగా ఏర్పడి విజిలెన్స్ ఆధ్వర్యంలో 2,661 సర్వీసులు తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా 65 కేసులు నమోదు చేసి రూ.4,24,600 అపరాధ రుసుం విధించారు. ప్రభుత్వం ప్రజా శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని సూర్యఘర్ ద్వారా ప్రయోజనాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో విజిలెన్స్ ఈఈ భాస్కరరావు, డీఈ ఈఈ విజయ శ్రీనివాస్, ఆపరేషన్ విభాగం నుంచి చీరాల డీఈ ఈఈ హరి ప్రసాదరావు, పర్చూరు డీఈ ఈఈ శ్రీనివాసులు, వేటపాలెం డీఈ ఈఈ శ్రీనివాసరావు, ఏఈలు, జెఈలు, లైన్‌మేన్‌లు పాల్గొన్నారు.

ఉత్తమ చదువుతోనే సంస్కారం



మాట్లాడుతున్న ఎస్సై రాజ్యలక్ష్మి

చీరాల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశలో ఉత్తమంగా విద్యాభ్యాసం సాగిస్తేనే సంస్కారం సాధ్యమవుతుందని ఎస్సై గారపాటి రాజ్యలక్ష్మీ చెప్పారు. స్థానిక వైఏ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జాతీయ యాంటీ ర్యాగింగ్ వారోత్సవాలు నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ మురళీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథి ఎస్సై మాట్లాడారు. సహ విద్యార్థులతో ఏ విధంగా మెలగాలి, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అలాగే మహిళ రక్షణ చట్టంపై పలు సూచనలు చేశారు. కళాశాలలో యాంటీ ర్యాగింగ్ కమిటీ ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపల్ తెలిపారు.

ఆటో వర్కర్ల సమస్యలను పరిష్కరించాలి



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఆటో వర్కర్లు

బల్లికురవ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : ఆటో వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని, ఉచిత బస్సులు వస్తే తమకు తీవ్ర ఇబ్బందులు వస్తాయని మండల ఆటోవర్కర్ల యూనియన్ సభ్యులు చెప్పారు. మంగళవారం డిప్యూటీ తహసీల్దార్ రవికుమార్‌కు ఆటో వర్కర్లు తమ డిమాండ్లపై వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం తమను ఆదుకోవాలన్నారు. వాహన మిత్ర పథకాన్ని అమలు చేయాలని, ఏడాదికి రూ.15 వేలు అందజేయాలని, అలానే డ్రైవర్లకు వ్యక్తిగత ప్రమాద బీమా అమలు చేయాలని చెప్పా రు. ఈ కార్యక్రమంలో సీపీఐ నేతలు అప్పారావు, ఆటో వర్కర్ల నేతలు కందుల మరియబాబు, రామారావు, యేసు, అజయ్ పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న ప్రత్యేక శ్రేణి కార్యదర్శి సూర్య ప్రకాష్‌రెడ్డి

అద్దంకి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ మార్కెట్ కమిటీ సిబ్బంది కచ్చితంగా సమాచారహక్కు చట్టంపై అవగాహన కలిగి ఉండాలని అద్దంకి వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి సూర్య ప్రకాష్‌రెడ్డి చెప్పారు. సమాచార హక్కు చట్టం-2005పై మంగళవారం స్థానిక మార్కెట్ యార్డులో సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్య క్రమంలో మార్కెట్ కమిటీ, అగ్నిమాపక శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

డెంగ్యూ వ్యాధిపై కరపత్రాల పంపిణీ

మార్టూరు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాగరాజుపల్లిలో మంగళవారం ఎంపీడీవో శ్రీనివాసరావు ఆధ్వర్యంలో డెంగ్యూ వ్యాధి నివారణా మార్గాలపై కరపత్రాలను గ్రామంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మురళీకృష్ణ పాల్గొన్నారు.

10 మంది జూదరుల అరెస్ట్

చినగంజాం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి) : మోటుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని కుంకుడుచెట్లపాలెం గ్రామ శివారులో పేకాట స్థావరంపై దాడి చేసి పదిమందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇంకొల్లు సీఐ వైవీ రమణయ్య ఆధ్వర్యంలో ఈ దాడి చేశారు. వారి వద్ద రూ.1,40, 520లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. నిందితులను బుధవారం కోర్టులో హాజరుపరచనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ ఎస్.రమేష్ పాల్గొన్నారు.